RNI No Tel / 2012 /4241

ప్రతి అక్షరం.. ప్రజల పక్షం..

# హైదరాబాద్ ఎస్టేట్

తెలుగు దిన పత్రిక

THE LARGEST CIRCULATED TELUGU NEWS PAPER

hyderabadestate.co.in




సంపుటి -13 సంచిక - 461 | 29 శనివారం ఆగస్టు 2026 | ఎడిటర్: బట్టు లక్ష్మీ నారాయణ | పేజీలు - 6 వెల రూ 5 /--

## తెలంగాణలో అంగన్‌వాడీ

# ఉద్యోగాల జాతర..

### ఇంటర్ అర్హతతో 15,982 పోస్టుల భర్తీ

తెలంగాణ ప్రభుత్వం రాష్ట్రంలోని నిరుద్యోగులకు శుభవార్త చెప్పింది. రాష్ట్రవ్యాప్తంగా అంగన్‌వాడీ కేంద్రాల్లో ఖాళీగా ఉన్న భారీ సంఖ్యలో పోస్టులను భర్తీ చేయాలని నిర్ణయించింది. ఈ మేరకు మొత్తం 15,982 పోస్టులను సెప్టెంబర్ నెలలోగా భర్తీ చేయాలని అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది.ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం, ఈ నియామకాలు జిల్లా స్థాయిలో జరగనున్నాయి. మొత్తం ఖాళీలలో జోన్-1 పరిధిలో 1,853 టీచర్ పోస్టులు, 7,737 ఆయా పోస్టులు ఉన్నాయి. జోన్-2 పరిధిలో 1,247 టీచర్ పోస్టులు, 5,145 ఆయా పోస్టులను భర్తీ చేయనున్నారు. ఈ పోస్టులకు దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు ఇంటర్మీడియట్ (ఇంటర్) ఉత్తీర్ణులై ఉండాలని ప్రభుత్వం స్పష్టం చేసింది.అభ్యర్థుల ఎంపిక ప్రక్రియ ఇంటర్వ్యూ ద్వారా జరగనుంది. ఎంపికలో భాగంగా అభ్యర్థుల ఇంటర్మీడియట్‌లో సాధించిన మార్కులకు 70 శాతం వెయిటేజీ ఇవ్వనున్నారు. ఇంటర్వ్యూకు 10 శాతం మార్కులు కేటాయించారు. అలాగే, ప్రత్యేక కేటగిరీల కింద వితంతువులకు 5 శాతం, అనాథలకు 10 శాతం, దివ్యాంగులకు 5 శాతం చొప్పున వెయిటేజీ కల్పించనున్నారు. ఈ నియామక ప్రక్రియను వేగవంతం చేసి, సెప్టెంబర్ నాటికి పూర్తి చేయాలని ప్రభుత్వం నిర్దేశించింది. ఈ నిర్ణయంతో వేలాది మంది నిరుద్యోగ మహిళలకు ఉపాధి అవకాశాలు లభించనున్నాయి.



# రేవంత్ రెడ్డికి రాఖీ కట్టిన

## కొండా సురేఖ, సీతక్క



రక్షా బంధన్ సందర్భంగా తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నివాసంలో పండుగ వాతావరణం నెలకొంది. మంత్రులు కొండా సురేఖ, సీతక్క కలిసి సీఎం నివాసానికి వెళ్లి ఆయనకు రాఖీ కట్టి శుభాకాంక్షలు తెలిపారు. ముఖ్యంగా, ఇటీవల పరకాల నియోజకవర్గం కేంద్రంగా చెలరేగిన తీవ్ర రాజకీయ వివాదం, కుమార్తె సుస్మిత వ్యాఖ్యల దుమారం తర్వాత మంత్రి కొండా సురేఖ నేరుగా ముఖ్యమంత్రి నివాసానికి వెళ్లడం రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారింది.ఈ వివాదానికి ప్రధాన కారణం ములుగు, పరకాల ప్రాంతాల్లో ఇటీవల సీఎం రేవంత్ రెడ్డి పాల్గొన్న అధికారిక కార్యక్రమాలకు వరంగల్ జిల్లాకు చెందిన మంత్రి కొండా సురేఖ హాజరుకాకపోవడమే. స్థానిక పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డితో సురేఖ వర్గానికి తీవ్ర విభేదాలు ఉన్నాయి. వచ్చే ఎన్నికల్లో రేవూరిని భారీ మెజార్టీతో గెలిపించాలని సీఎం కోరడంతో, ఆయనకే మళ్లీ టికెట్ అనే సంకేతాలు వెళ్లాయి. దీనిపై ఆగ్రహం వ్యక్తం చేసిన కొండా సురేఖ కుమార్తె సుస్మిత గీసుకొండలో ప్రత్యేక సభ పెట్టి సీఎం రేవంత్ రెడ్డి, ఎమ్మెల్యే రేవూరిలపై తీవ్రస్థాయిలో విమర్శలు చేయడంతో పాటు రాబోయే ఎన్నికల్లో తాను పరకాల నుంచే పోటీ చేస్తానని ప్రకటించారు.సీఎంపై నేరుగా జరిగిన ఈ విమర్శలను కాంగ్రెస్ అధిష్ఠానం తీవ్రంగా పరిగణించి పీసీసీ క్రమశిక్షణ కమిటీ ద్వారా కొండా సురేఖకు నోటీసులు జారీ చేసింది. అయితే తన కుమార్తె చేసిన కామెంట్లకు తాను బాధ్యురాలిని కానని సురేఖ వివరణ ఇచ్చినప్పటికీ, ఆమెపై కేబినెట్ నుంచి వేటు పడే అవకాశం ఉందనే ఊహాగానాలు జోరుగా సాగాయి. ఇలాంటి తీవ్ర ఉత్కంఠ వాతావరణంలో, రాఖీ పండుగ సందర్భంగా కొండా సురేఖ నేరుగా సీఎం నివాసానికి వచ్చి రేవంత్ రెడ్డికి రాఖీ కట్టడం ద్వారా వివాదాలకు స్వస్తి చెప్పి రాజీ మార్గాన్ని ఎంచుకున్నట్లు రాజకీయ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది.

## అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు

### : మంత్రి పొంగులేటి హామీ



తెలంగాణ రాష్ట్రంలోని అర్హులైన పేదలందరికీ ఎటువంటి వివక్ష లేకుండా ఇందిరమ్మ ఇళ్లను కేటాయిస్తున్నట్లు రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి స్పష్టం చేశారు. జీహెచ్ఎంసీ పరిధిలో తొలి విడతలో భాగంగా 7,350 ఇళ్లను లాటరీ పద్ధతి ద్వారా అత్యంత పారదర్శకంగా లబ్ధిదారులకు అందజేస్తున్నామని ఆయన తెలిపారు.శుక్రవారం నాంపల్లి నియోజకవర్గంలో నిర్వహించిన లక్కీ డ్రా కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కులం, మతం, రాజకీయాలకు అతీతంగా కేవలం అర్హతనే ప్రామాణికంగా తీసుకుని ఇళ్ల పంపిణీ చేపడుతున్నామని వెల్లడించారు. ఇప్పటికే కుత్బుల్లాపూర్, కంటోన్మెంట్, రాజేంద్రనగర్, నాంపల్లి నియోజకవర్గాల్లో లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ పూర్తయిందని వివరించారు. పేదల ఆత్మగౌరవాన్ని పెంపొందించేలా వందల కోట్ల రూపాయల విలువైన భూముల్లో సైతం గృహాలను నిర్మించి అందిస్తామని మంత్రి భరోసా ఇచ్చారు.రాబోయే పది రోజుల్లో రెండో విడత లబ్ధిదారుల జాబితాను కూడా ప్రకటించే అవకాశం ఉందని పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు. ఇప్పటికే 16 నియోజకవర్గాల్లో ఇళ్ల నిర్మాణానికి అవసరమైన స్థలాలను సేకరించి, టెండర్ల ప్రక్రియను పూర్తి చేసినట్లు తెలిపారు. మరో రెండు, మూడు రోజుల్లో ఆయా ప్రాంతాల్లో టవర్ల నిర్మాణం ప్రారంభమవుతుందని ఆయన వెల్లడించారు.

### పచ్చదనం సంకల్పాన్ని నాగబాబు

## సమర్థంగా నెరవేర్చాలి

### : పవన్ కల్యాణ్



ఏపీ గ్రీన్ ఎగ్జిక్యూటివ్ కమిటీ ఛైర్మన్‌గా జనసేన ఎమ్మెల్సీ నాగబాబు కేబినెట్ హోదాతో బాధ్యతలు స్వీకరించిన సంగతి తెలిసిందే. ఈ సందర్భంగా నాగబాబుకు ఆయన సోదరుడు, రాష్ట్ర డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. పచ్చదనంతో కళకళలాడే ఆంధ్రప్రదేశ్‌ను నిర్మించాలనే ఆశయంతో కూటమి ప్రభుత్వం ఈ ప్రత్యేక నెట్‌వర్క్‌ను ఏర్పాటు చేసిందని, ప్రకృతిపై ఎంతో ప్రేమ ఉన్న నాగబాబు ఈ బృహత్తర బాధ్యతను సమర్థవంతంగా నిర్వర్తిస్తారని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.2047 నాటికి రాష్ట్ర భౌగోళిక విస్తీర్ణంలో పచ్చదనాన్ని ఏకంగా 50 శాతానికి పెంచడమే లక్ష్యంగా పెట్టుకున్నామని, ఈ భారీ ప్రాజెక్టును నాగబాబు ముందుకు తీసుకెళతారని పవన్ పేర్కొన్నారు. పర్యావరణ పరిరక్షణను కేవలం ఒక ప్రభుత్వ కార్యక్రమంగా కాకుండా ఒక ప్రజా ఉద్యమంగా మలిచే బాధ్యతలో ఆయన పూర్తి విజయం సాధించాలని ఆకాంక్షించారు.మరోవైపు, నాగబాబుకు కేబినెట్ హోదా కల్పిస్తూ ఏపీ గ్రీన్ కమిటీ ఛైర్మన్‌గా నియమించిన ముఖ్యమంత్రి చంద్రబాబుకి, అందుకు మద్దతు తెలిపిన కూటమి భాగస్వామ్య పక్షాల నాయకులకు పవన్ కల్యాణ్ ఎక్స్ వేదికగా ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.

## ఎవరి జాగీరు అని మీ ఫొటోలు వేసుకుంటున్నారు?

### : కాంగ్రెస్ నేతలపై ఈటల ఫైర్



తెలంగాణలో గత కేసీఆర్ ప్రభుత్వ పాలనకు, ప్రస్తుత రేవంత్ రెడ్డి పాలనకు ఎలాంటి వ్యత్యాసం లేదని... ఈ పాలనతో రాష్ట్ర ప్రజలు పెనం మీద నుంచి పొయ్యిలో పడ్డామని భావిస్తున్నారని బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం ప్రజలకు ఐదు కిలోల సన్న బియ్యం ఉచితంగా ఇస్తున్నప్పటికీ ప్రధాని మోదీ ఫొటోను ఎక్కడా వేయడం లేదని... కానీ కాంగ్రెస్ నేతలు ఎవరి జాగీరని వారి ఫొటోలు వేసుకుంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాహుల్ గాంధీ విదేశాలకు వెళ్లి దేశంలో మత కల్లోలాలు జరుగుతున్నాయని ప్రచారం చేస్తున్నారని విమర్శించిన ఈటల, గతంలో కాంగ్రెస్ హయాంలోనే లుంబిని పార్క్, గోకుల్ చాట్‌లలో బాంబు పేలుళ్లు జరిగాయని గుర్తు చేశారు. ఢిల్లీ వెళ్లినప్పుడు మోదీ ఆశీర్వాదం కావాలని కోరే సీఎం రేవంత్... ఇక్కడకు వచ్చాక మాత్రం విమర్శలు చేయడం ఆయన ద్వంద్వ విధానానికి నిదర్శనమన్నారు. కేంద్రం ఇచ్చే నిధుల వల్లే రాష్ట్రంలో రహదారులు, రైల్వేలు అభివృద్ధి చెందుతున్నాయని తెలిపారు.ఇందిరమ్మ ఇండ్ల కమిటీలు వేసి, కాంగ్రెస్ నాయకులకు కేటాయించుకుంటున్నారని ఈటల మండిపడ్డారు. 'ఇది మీ తాత జాగీరు కాదు' అంటూ ఈటల మండిపడ్డారు. కేంద్ర ప్రభుత్వం ఇళ్ల నిర్మాణాలు, మెట్రో ఫేజ్-1, ఫేజ్-2లకు తగిన సహాయం అందిస్తోందని స్పష్టం చేశారు. మల్కాజ్‌గిరి, మేడ్చల్ పరిధిలోని పలు రైల్వే గేట్ల వద్ద ఆర్వోబీ, ఆర్‌యూబీ నిర్మాణాల వల్ల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, ఈ అంశంపై సీఎస్‌ను కలిసి చర్చించానన్నారు. మేడ్చల్, మల్కాజ్‌గిరి స్టేషన్ల అభివృద్ధికి అమృత్ పథకం కింద కేంద్రం రూ.22 కోట్లు ఇస్తోందని ఈటల వెల్లడించారు.

## తండ్రి పేరు సవరణకు..

### మంత్రి పొన్నం ప్రభాకర్‌కు 'సర్' నోటీసులు




తెలంగాణ రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌కు ఎన్నికల అధికారులు నోటీసులు జారీ చేశారు. ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా కొనసాగుతున్న ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమంలో భాగంగా, బూత్ లెవల్ ఆఫీసర్ (బీఎల్ఓ) స్వయంగా మంత్రిని కలిసి ఈ నోటీసును అందజేశారు.ఓటర్ల జాబితాలో మంత్రి పొన్నం ప్రభాకర్ తండ్రి సత్తయ్య గౌడ్ పేరు తప్పుగా నమోదైంది. ఈ విషయాన్ని గుర్తించిన బీఎల్ఓ, నిబంధనల ప్రకారం సవరణ నిమిత్తం మంత్రికి నోటీసు జారీ చేశారు. ఓటర్ల జాబితా రూపకల్పనలో భాగంగా ఇది సాధారణంగా జరిగే ప్రక్రియే.ఈ నోటీసులపై మంత్రి పొన్నం ప్రభాకర్ తక్షణమే స్పందించారు. తన తండ్రి పేరును సరిచేయడానికి అవసరమైన ధ్రువపత్రాలను ఆయన బీఎల్ఓకు సమర్పించారు. కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఓటర్ల జాబితాలను క్షుణ్ణంగా పరిశీలించి, తప్పులను సరిదిద్దేందుకే 'సర్' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా అధికారులు ప్రతి ఇంటికీ వెళ్లి వివరాలను సరిచూస్తున్నారు. ఈ క్రమంలోనే మంత్రికి కూడా నోటీసు అందినట్లు స్పష్టమవుతోంది.

## 'ఇంకా అయిపోలేదు'.. ఇరాన్‌పై ట్రంప్ సంచలన వ్యాఖ్యలు



ఇరాన్‌పై అమెరికా సైనిక చర్య ముగిసిపోయిందని భావించవద్దని అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ హెచ్చరించారు. హర్మూజ్ జలసంధి తిరిగి తెరుచుకున్నా.. ఇరాన్‌పై సైనిక చర్యకు పూర్తిగా తెరపడలేదని స్పష్టం చేశారు.తాజా ఘర్షణల తర్వాత ఇరాన్ తీవ్ర ఆర్థిక, సైనిక ఒత్తిడిలో ఉందని ట్రంప్ అన్నారు. సైన్యానికి జీతాలు కూడా చెల్లించలేని స్థితిలో ఉందని వ్యాఖ్యానించారు. ఇరాన్ సామర్థ్యం బాగా తగ్గిపోయిందని తెలిపారు.ప్రస్తుతం ఇరాన్‌తో చర్చలు జరిపే ఆలోచన లేదని కూడా ట్రంప్ తేల్చిచెప్పారు. హర్మూజ్ జలసంధి తెరుచుకోవడం ఒక ముఖ్యమైన పరిణామమేనని, అంతమాత్రాన సైనిక చర్యలు ముగిసినట్లు కాదని అన్నారు.ఇరాన్‌పై తదుపరి సైనిక చర్య ఎప్పుడు ఉంటుందనే విషయంపై మాత్రం ఆయన వివరాలు వెల్లడించలేదు. ఎలాంటి పరిస్థితుల్లో మరోసారి దాడులకు దిగుతారో కూడా చెప్పలేదు.

ఇరాన్‌తో సంబంధాల విషయంలో రష్యాపై చర్యలు తీసుకుంటారా? అన్న ప్రశ్నకు ట్రంప్ స్పందించారు. హర్మూజ్ జలసంధి అంశంలో ఇప్పటివరకు రష్యా బాగానే వ్యవహరించిందని చెప్పారు. అయితే ఇరాన్‌తో రష్యా సంబంధాలపై తమ అంచనా ఏంటో స్పష్టం చేయలేదు.ఇరాన్, ఒమన్ మధ్య ఉన్న హర్మూజ్ జలసంధి ప్రపంచ ఇంధన రవాణాలో అత్యంత కీలక మార్గం. గల్ఫ్ దేశాల నుంచి భారీగా చమురు, సహజవాయువు ఈ మార్గం గుండా అంతర్జాతీయ మార్కెట్లకు చేరుతాయి.

RNI No Tel / 2012 /4241
హైద్రాబాద్ ఎస్టేట్
THE LARGEST CIRCULATED TELUGU NEWS PAPER · తెలుగు దిన పత్రిక · hyderabadestate.co.in

29 శనివారం ఆగస్టు 2026

## షుగర్ ఫ్రీ రైస్ ఈ రైస్ తినడం వల్ల షుగర్ తగ్గుముఖం పడుతుంది

### అంటే ఇక నేను కూడా ఇవే రైస్ తింటానంటున్న ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి

**హైద్రాబాద్ ఎస్టేట్ ప్రతినిధి భాస్కర్ హన్మకొండ**

హనుమకొండ ఫారెస్ట్ ఆఫీస్ సమీపంలో భావన డి ఐ ఏ రైస్ 225వ బ్రాంచ్ ను ప్రారంభించారు ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి మరియు భావన రైస్ చైర్మన్ జమ్మలమూడి సుదీర్ మాట్లాడుతూ ఈ రైస్ లో షుగర్ క్వాంటిటీ తక్కువగా ఉండటం వల్ల డయాబెటిక్ పేషెంట్స్ అందరూ కూడా ఈ రైస్ ని వాడడం వల్ల షుగర్ కంట్రోల్ లో ఉంటుందని ఇది వాడడం వల్ల బాడీలో షుగర్ కొలెస్ట్రాల్ లాంటివి కంట్రోల్ లో ఉండి ఎలాంటి వ్యాధులు రాకుండా కాపాడతాయని దీనిని వ్యవసాయ పరిశోధనా కేంద్రంలో పరీక్షించిన అనంతరం దీనికి సర్టిఫై చేసిన తర్వాతనే మార్కెట్లోకి వచ్చాయని ఇక్కడ పంటలు పండియడం వల్ల రైతులకు కూడా ఎంతో గిట్టుబాటు ధర కలుగుతుందని ఇది అమ్ముడుపోదు అన్న సమస్య లేకుండా త్వరగా అమ్ముడుపోవడం జరుగుతుందని వారు తెలిపారు ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు రైతులు పాల్గొన్నారు



# రక్తబంధాల పండుగ.. రాఖీ సంబరం!

### - దాస్యం వినయ్ భాస్కర్ ఇంట ఘనంగా రక్షాబంధన్ వేడుకలు
### - అన్నకు రాఖీ కట్టి.. మంగళహారతులతో దీవించిన సోదరీమణులు

**హన్మకొండ, ఆగష్టు 28 హైదరాబాద్ ఎస్టేట్:**

అన్నాచెల్లెళ్ల ఆత్మీయ అనుబంధానికి ప్రతీకగా నిలిచే రక్షాబంధన్ వేడుకలు మాజీ ప్రభుత్వ చీఫ్ విప్, మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్ భాస్కర్ నివాసంలో ఘనంగా జరిగాయి. రాఖీ పౌర్ణమిని పురస్కరించుకుని ఆయన సోదరీమణులు ఇంటికి చేరుకుని సోదరుడికి రాఖీలు కట్టి, మంగళహారతులు ఇచ్చి ఆశీర్వదించారు. దీంతో ఆయన నివాసంలో పండుగ వాతావరణం నెలకొంది. సంప్రదాయబద్ధంగా తిలకం దిద్ది రక్షాసూత్రాలు కట్టిన సోదరీమణులు.. అన్న ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. సోదరీమణుల ప్రేమాభిమానాలకు దాస్యం వినయ్



భాస్కర్ కృతజ్ఞతలు తెలిపారు. కుటుంబ సభ్యుల సమక్షంలో జరిగిన వేడుకలు ఆత్మీయంగా సాగాయి. ఈ సందర్భంగా దాస్యం వినయ్ భాస్కర్ మాట్లాడుతూ.. రక్షాబంధన్ కేవలం రాఖీ కట్టుకునే పండుగ కాదని, అన్నాచెల్లెళ్ల మధ్య ప్రేమ, ఆప్యాయత, పరస్పర బాధ్యతలను గుర్తుచేసే పవిత్ర సంప్రదాయమని అన్నారు. భారతీయ సంస్కృతిలో కుటుంబ బంధాలకు రక్షాబంధన్ ప్రత్యేక స్థానం ఉందని పేర్కొన్నారు. కుటుంబ విలువలను కాపాడుకుంటూ సోదరసోదరీమణుల అనుబంధాన్ని మరింత బలోపేతం చేసుకోవాలని సూచించారు. ప్రతి ఇంటా ప్రేమానురాగాలు వెల్లివిరిసి, సుఖసంతోషాలు నిండాలని ఆకాంక్షించారు. "రాజకీయాలు, ప్రజా జీవితం ఎన్ని బాధ్యతలు మోపినా.. సోదరీమణుల చేతికి కట్టే రాఖీ అందించే ఆత్మీయతకు ప్రత్యేకమైన స్థానం ఉంటుంది. ఆ బంధం ప్రేమతో పాటు బాధ్యతను కూడా గుర్తుచేస్తుంది" అని దాస్యం వినయ్ భాస్కర్ అన్నారు.

## మహిళలకు రక్షణగా నిలుద్దాం.. దేశ రక్షణలో భాగస్వాములవుదాం

### - హన్మకొండ పబ్లిక్ గార్డెన్‌లో ఘనంగా రాఖీ వేడుకలు
### - సోదరభావం, సామాజిక బాధ్యతను చాటిన సైకిల్ వాకర్స్, యోగా బృందం

**హన్మకొండ, ఆగష్టు 28 హైదరాబాద్ ఎస్టేట్:**

మహిళల గౌరవం, భద్రతకు సమాజమంతా అండగా నిలవాలని, ప్రతి పౌరుడు దేశ రక్షణలో తన వంతు బాధ్యతను నిర్వర్తించాలని సైకిల్ వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు జంగా గోపాల్‌రెడ్డి పిలుపునిచ్చారు. రాఖీ పౌర్ణమిని పురస్కరించుకుని సైకిల్ వాకర్స్ అసోసియేషన్ (వరంగల్), హన్మకొండ పబ్లిక్ గార్డెన్ యోగా బృందం సంయుక్త ఆధ్వర్యంలో రాఖీ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జంగా గోపాల్‌రెడ్డి మాట్లాడుతూ.. రక్షాబంధన్ కేవలం అన్నాచెల్లెళ్ల మధ్య రాఖీ కట్టుకునే వేడుక మాత్రమే కాదని, ప్రేమ, ఆప్యాయత, సోదరభావం, పరస్పర బాధ్యతలకు ప్రతీకగా నిలిచే పవిత్ర సంప్రదాయమని అన్నారు. సోదరీమణులు రాఖీలు కట్టి భారతీయ సంస్కృతి, సంప్రదాయాల్లోని గొప్ప విలువలను చాటారని పేర్కొన్నారు. మహిళల భద్రత ఒక్కరి బాధ్యత కాదని, సమాజంలోని ప్రతి ఒక్కరూ తమ బాధ్యతగా భావించాలని ఆయన అన్నారు. మహిళలకు గౌరవం, భద్రత కల్పించినప్పుడే సమాజం నిజమైన అభివృద్ధి సాధిస్తుందని పేర్కొన్నారు. మహిళలు అన్ని రంగాల్లో ముందుకు సాగుతూ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. రాఖీ వేడుకల సందర్భంగా సోదరీమణులు సోదరులకు రాఖీలు కట్టి, ఆత్మీయతను పంచుకున్నారు. దీంతో పబ్లిక్ గార్డెన్‌లో ఆహ్లాదకర వాతావరణం నెలకొంది. సైకిల్ వాకర్స్, యోగా బృందం సభ్యులు ఉత్సాహంగా పాల్గొని సోదరభావాన్ని చాటారు.



కార్యక్రమంలో అసోసియేషన్ కార్యదర్శి పి. అనంత్‌కుమార్, కోశాధికారి పి. రమేష్, కార్యవర్గ సభ్యులు శేఖర్‌గౌడ్, సత్యం, లక్ష్మయ్య, వేణు, యోగా బృందం సభ్యులు శ్రీనివాస్, నరహరి, చందర్, రాఘవరెడ్డి, మహేందర్, సోదరీమణులు అమరావతి, భగవతి, సంధ్యతో పాటు పలువురు వాకర్స్ పాల్గొన్నారు.

# కల్మషం లేని ప్రేమకు 'రక్ష'..

## చిన్నారుల మోముల్లో వెలుగులు!

### - కడియం నివాసంలో ప్రత్యేక అవసరాల చిన్నారులతో ఆత్మీయంగా రాఖీ వేడుకలు
### - పండుగ అంటే నలుగురి ముఖాల్లో నవ్వులు పూయించడమే: ఎంపీ డాక్టర్ కడియం కావ్య, ఎమ్మెల్యే కడియం శ్రీహరి

**హన్మకొండ, ఆగష్టు 28 హైదరాబాద్ ఎస్టేట్:**

రక్తసంబంధాల పరిధిని దాటి.. నిస్వార్థ ప్రేమ, ఆప్యాయతలకు ప్రతీకగా నిలిచింది ఆ వేడుక. రాఖీ పౌర్ణమి సందర్భంగా హన్మకొండ కనకదుర్గ కాలనీలోని కడియం నివాసం ఆత్మీయతకు వేదికైంది. మల్లికాంబ మనోవికాస కేంద్రానికి చెందిన ప్రత్యేక అవసరాల చిన్నారులతో కలిసి వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య, మాజీ ఉప ముఖ్యమంత్రి, స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి రాఖీ వేడుకల్లో పాల్గొన్నారు. మనోవికాస కేంద్రానికి చెందిన చిన్నారులు ఎంతో ఉత్సాహంగా ఎంపీ కావ్య, ఎమ్మెల్యే శ్రీహరి చేతులకు రాఖీలు కట్టారు. చిన్నారుల స్వచ్ఛమైన ఆప్యాయతకు ప్రజాప్రతినిధులు సంతోషం వ్యక్తం చేశారు. వారిని ఆత్మీయంగా దగ్గరకు తీసుకుని మిఠాయిలు తినిపించి ఆశీర్వదించారు. చిన్నారులతో కొద్దిసేపు మమేకమై వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎంపీ డాక్టర్ కడియం కావ్య, ఎమ్మెల్యే కడియం శ్రీహరి మాట్లాడుతూ.. పండుగలు కేవలం కుటుంబ సభ్యులతోనే జరుపుకోవడం కాకుండా, సమాజంలో ప్రేమ, ఆప్యాయత అవసరమైన వారి ముఖాల్లో చిరునవ్వులు పూయించినప్పుడే వాటికి నిజమైన సార్థకత చేకూరుతుందని అన్నారు. ప్రత్యేక అవసరాలు కలిగిన చిన్నారులకు చిన్నపాటి ప్రోత్సాహం, ఆప్యాయత అందిస్తే వారిలో ఆత్మవిశ్వాసం పెరిగి తమ ప్రతిభను చాటుకునే అవకాశం లభిస్తుందని పేర్కొన్నారు. చిన్నారులను కంటికి రెప్పలా కాపాడుతూ.. వారి వికాసానికి కృషి చేస్తున్న మల్లికాంబ మనోవికాస కేంద్రం నిర్వాహకులు, ఉపాధ్యాయులను వారు అభినందించారు. చిన్నారుల సంక్షేమం, మనోవికాస



కేంద్రం అభివృద్ధికి తమ వంతు సహకారం ఎల్లప్పుడూ అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మల్లికాంబ మనోవికాస కేంద్రం నిర్వాహకులు, ప్రతినిధులు, ఉపాధ్యాయులు, చిన్నారులు పాల్గొన్నారు.

## రాఖీ కట్టి.. సోదరబంధాన్ని చాటిన చిన్నారులు

### - ఇనగాల వెంకట్రామ్‌రెడ్డి నివాసంలో ఆత్మీయంగా రక్షాబంధన్ వేడుకలు



**హనుమకొండ, ఆగస్టు 28 హైదరాబాద్ ఎస్టేట్:**
రాఖీ పౌర్ణమి సందర్భంగా మల్లికాంబ ఆశ్రమ చిన్నారులు ఆత్మీయతను పంచుకున్నారు. బాలసముద్రంలోని మల్లికాంబ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెంటల్లీ హ్యాండీక్యాప్డ్ అండ్ డిసేబిలిటీస్‌కు చెందిన చిన్నారులు హనుమకొండ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు ఇనగాల వెంకట్రామ్‌రెడ్డిని ఆయన నివాసంలో కలిసి రాఖీలు కట్టారు. సోదరభావానికి ప్రతీకగా నిలిచే రక్షాబంధన్ వేడుకను ఆయనతో కలిసి జరుపుకున్నారు. చిన్నారుల రాకతో ఇనగాల వెంకట్రామ్‌రెడ్డి నివాసంలో ఆత్మీయ వాతావరణం నెలకొంది. ఆయన చిన్నారులను ఆప్యాయంగా పలకరించి, వారితో కొద్దిసేపు మమేకమయ్యారు. వారి యోగక్షేమాలను తెలుసుకుంటూ స్నేహపూర్వకంగా గడిపారు. అనంతరం చిన్నారులకు స్వయంగా మిఠాయిలు తినిపించి, బహుమతులు అందజేశారు. రాఖీ పండుగ సందర్భంగా చిన్నారులు చూపిన ప్రేమాభిమానాలకు ఇనగాల వెంకట్రామ్‌రెడ్డి సంతోషం వ్యక్తం చేశారు. ఆశ్రమ నిర్వాహకులు, సిబ్బంది ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## షుగర్ ఫ్రీ రైస్ ఈ రైస్ తినడం వల్ల షుగర్ తగ్గుముఖం పడుతుంది అంటే ఇక నేను కూడా ఇవే రైస్ తింటానంటున్న ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి

**హైద్రాబాద్ ఎస్టేట్ ప్రతినిధి భాస్కర్ హన్మకొండ**
హనుమకొండ ఫారెస్ట్ ఆఫీస్ సమీపంలో భావన డి ఐ ఏ రైస్ 225వ బ్రాంచ్ ను ప్రారంభించారు ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి మరియు భావన రైస్ చైర్మన్ జమ్మలమూడి సుదీర్ మాట్లాడుతూ ఈ రైస్ లో షుగర్ క్వాంటిటీ తక్కువగా ఉండటం వల్ల డయాబెటిక్ పేషెంట్స్ అందరూ కూడా ఈ రైస్ ని వాడడం వల్ల షుగర్ కంట్రోల్ లో ఉంటుందని ఇది వాడడం వల్ల బాడీలో షుగర్ కొలెస్ట్రాల్ లాంటివి కంట్రోల్ లో ఉండి ఎలాంటి వ్యాధులు రాకుండా కాపాడతాయని దీనిని వ్యవసాయ పరిశోధనా కేంద్రంలో పరీక్షించిన అనంతరం దీనికి సర్టిఫై చేసిన తర్వాతనే మార్కెట్లోకి వచ్చాయని ఇక్కడ పంటలు పండియడం వల్ల రైతులకు కూడా ఎంతో గిట్టుబాటు ధర కలుగుతుందని ఇది అమ్ముడుపోదు అన్న సమస్య లేకుండా త్వరగా అమ్ముడుపోవడం జరుగుతుందని వారు తెలిపారు ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు రైతులు పాల్గొన్నారు



## ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి గారికి రాఖీ కట్టిన ఎంపీ కావ్య గారు

రాఖీ పౌర్ణమి సందర్భంగా వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యులు శ్రీ నాయిని రాజేందర్ రెడ్డి గారికి వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు శ్రీమతి కడియం కావ్య గారు రాఖీ కట్టారు.



ఈ సందర్భంగా అన్నాచెల్లెళ్ల అనుబంధానికి ప్రతీకగా నిలిచే రాఖీ పండుగను పురస్కరించుకుని ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి గారికి ఎంపీ కావ్య గారు రాఖీ కట్టి, వారి ఆశీస్సులు తీసుకున్నారు. ఈ సందర్భంగా ఇరువురు పరస్పరం రాఖీ పౌర్ణమి శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు.

## రాఖీతో బలపడిన సోదర అనుబంధం

### ఆరుట్లలో ఘనంగా రక్షాబంధన్ వేడుకలు



**హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి ఆగస్టు 28:-**
ఆరుట్ల: అన్నాచెల్లెళ్లు, అక్కాతమ్ముళ్ల మధ్య ప్రేమానురాగాలు, ఆత్మీయతకు రాఖీ పౌర్ణమి ప్రతీకగా నిలుస్తుందని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు కొంగర విష్ణువర్ధన్ రెడ్డి అన్నారు. రాఖీ పౌర్ణమిని పురస్కరించుకొని ఆరుట్ల గ్రామ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో శుక్రవారం రక్షాబంధన్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నూకం బాలరాజు, కార్యదర్శి చిందం శ్రీశైలం ఆధ్వర్యంలో పార్టీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో గ్రామానికి చెందిన మహిళలు, ఆడపడుచులు, మహిళా కార్యకర్తలు పాల్గొని కాంగ్రెస్ నాయకులకు రాఖీలు కట్టి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా విష్ణువర్ధన్ రెడ్డి మాట్లాడుతూ రాఖీ కట్టడం ద్వారా సోదరుల మధ్య అనుబంధం మరింత బలపడుతుందని పేర్కొన్నారు. పరస్పర ప్రేమ, గౌరవం, ఆత్మీయతతో సమాజంలో ఐక్యతాభావం పెంపొందుతుందని అన్నారు.
ప్రజా ప్రభుత్వం మహిళల సంక్షేమం, అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తూ మహిళా సాధికారత కోసం అనేక కార్యక్రమాలను చేపడుతోందని తెలిపారు. మహిళలు అన్ని రంగాల్లో ముందుకు సాగేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం అండగా ఉంటుందని పేర్కొన్నారు.
కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు గుడిమల్ల చంద్రయ్య, మార సురేష్, చెరుకు నర్సింహ, బుట్టి కృష్ణ, చిందం ఐలయ్య, మంద యాదగిరిరెడ్డి, ఆర్ల శ్రీకాంత్, దండ వెంకన్న, యూత్ కాంగ్రెస్ నాయకులు పంబాల కిషోర్, ఎండి అశ్రఫ్, గౌరిగే కృష్ణ, దూసరి రాజు తదితరులు పాల్గొన్నారు.

RNI No Tel / 2012 /4241
ప్రతి అక్షరం.. ప్రజల పక్షం..
హైదరాబాద్ ఎస్టేట్
THE LARGEST CIRCULATED TELUGU NEWS PAPER తెలుగు దిన పత్రిక hyderabadestate.co.in
29 శనివారం ఆగస్టు 2026

# రాఖీ పండగ వేళ ఇబ్రహీంపట్నంలో కిక్కిరిసిన రహదారులు

### "సొంతింటి బాట పట్టిన ఆడబిడ్డలు.. వాహనాలతో సాగర్ హైవేపై రద్దీ"



**హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి ఆగస్టు 28:-**
ఇబ్రహీంపట్నం: రాఖీ పౌర్ణమి పండగ నేపథ్యంలో ఆడబిడ్డలు సొంతింటి బాట పట్టడంతో ఇబ్రహీంపట్నంలో శుక్రవారం వాహనాల రద్దీ ఒక్కసారిగా పెరిగింది. పండగను కుటుంబ సభ్యులతో కలిసి జరుపుకునేందుకు నగరంలోని వివిధ ప్రాంతాల్లో నివసిస్తున్న వారు తమ స్వగ్రామాలు, పుట్టింటికి తరలిరావడంతో ప్రధాన రహదారులు వాహనాలతో కిక్కిరిసిపోయాయి. ఇబ్రహీంపట్నం సాగర్ హైవేపై టెలిఫోన్ ఎక్స్ఛేంజ్ నుంచి కొత్త బస్టాండ్ వరకు ఉదయం వేళల్లో భారీగా వాహనాలు రాకపోకలు సాగించడంతో ట్రాఫిక్ నెమ్మదిగా కదిలింది. కార్లు, బస్సులు, ఆటోలు, ద్విచక్ర వాహనాలతో రహదారులు రద్దీగా మారాయి. దీంతో వాహనదారులు కొంత సమయం పాటు నెమ్మదిగా ప్రయాణించాల్సి వచ్చింది. రాఖీ పౌర్ణమి సందర్భంగా అన్నదమ్ములకు రాఖీ కట్టేందుకు ఆడబిడ్డలు పెద్ద సంఖ్యలో పుట్టింటికి బయలుదేరడంతో బస్సులు, ప్రైవేట్ వాహనాలు, సొంత వాహనాల్లో ప్రయాణించే వారి సంఖ్య పెరిగింది. దీంతో సాధారణ రోజులతో పోలిస్తే పట్టణంలోని ప్రధాన మార్గాల్లో వాహనాల రద్దీ అధికంగా కనిపించింది. పండగ వేళ కుటుంబ సభ్యులను కలుసుకునేందుకు ప్రయాణిస్తున్న ప్రజలతో ఇబ్రహీంపట్నం రహదారులు సందడిగా మారాయి. రద్దీ కారణంగా ప్రయాణికులు కొంత ఇబ్బంది పడినప్పటికీ, పండగ వాతావరణం పట్టణంలో కనిపించింది. పుట్టింటికి వెళ్తున్న ఆడబిడ్డలు, వారిని ఆత్మీయంగా ఆహ్వానించేందుకు ఎదురుచూస్తున్న కుటుంబాలతో రాఖీ పండగ సందడి నెలకొంది.

# అన్నాచెల్లెళ్ల అనుబంధానికి ప్రతీక రక్షాబంధన్



**హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి ఆగస్టు 28:-**
మహేశ్వరం: రక్షాబంధన్ పర్వదినాన్ని పురస్కరించుకుని మహేశ్వరం ఎమ్మెల్యే, మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి తన తమ్ముడు నరసింహారెడ్డి నివాసంలో రాఖీ వేడుకల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా తన తమ్ముడికి రాఖీ కట్టి, అన్నాచెల్లెళ్ల మధ్య ఉన్న ఆత్మీయతను చాటుకున్నారు. కుటుంబ సభ్యులతో కలిసి పండుగను ఆనందంగా జరుపుకున్నారు. రక్షాబంధన్ పండుగ భారతీయ కుటుంబ వ్యవస్థలో అన్నాచెల్లెళ్ల మధ్య ఉన్న ప్రేమ, నమ్మకం, అనురాగాలకు ప్రతీకగా నిలుస్తుందని సబితా ఇంద్రారెడ్డి పేర్కొన్నారు. రాఖీ కట్టడం కేవలం ఒక సంప్రదాయం మాత్రమే కాదని, ఒకరిపై ఒకరికి ఉన్న బాధ్యత, ఆప్యాయత, పరస్పర రక్షణకు ప్రతీక అని అన్నారు. మారుతున్న కాలంలోనూ కుటుంబ బంధాలు, మానవీయ విలువలను కాపాడుకోవాల్సిన అవసరం ఉందని ఆమె సూచించారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ప్రజలకు రక్షాబంధన్ శుభాకాంక్షలు తెలిపారు. ప్రతి కుటుంబంలో సోదర సోదరీమణుల మధ్య ప్రేమానురాగాలు మరింత బలపడాలని, వారి జీవితాల్లో సుఖసంతోషాలు వెల్లివిరియాలని ఆకాంక్షించారు. రాఖీ పండుగ సందర్భంగా సబితా ఇంద్రారెడ్డి, నరసింహారెడ్డి మధ్య జరిగిన ఆత్మీయ వేడుకకు సంబంధించిన దృశ్యాలు కుటుంబ సభ్యులు, అభిమానుల్లో ఆనందాన్ని నింపాయి. రక్షాబంధన్ పండుగ కుటుంబ బంధాల విలువను మరోసారి గుర్తు చేస్తుందని ఆమె అన్నారు.

# చిట్యాల సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన ఎడ్లపల్లి సతీష్



**హైదరాబాద్ ఎస్టేట్ చిట్యాల ప్రతినిధి మ్యాదరి సునీల్**
**చిట్యాల (జయశంకర్ భూపాలపల్లి జిల్లా):**
జయశంకర్ భూపాలపల్లి జిల్లా చిట్యాల పోలీస్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ (సీఐ)గా వై. సతీష్ (ఎడ్లపల్లి సతీష్) బాధ్యతలు స్వీకరించారు. శుక్రవారం స్థానిక సర్కిల్ కార్యాలయంలో ఆయన అధికారికంగా పదవీ బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా సీఐ సతీష్ మాట్లాడుతూ:
శాంతిభద్రతల పరిరక్షణ: సర్కిల్ పరిధిలోని అన్ని గ్రామాల్లో శాంతిభద్రతల పరిరక్షణకు మొదటి ప్రాధాన్యత ఇస్తామని తెలిపారు. చట్టవ్యతిరేక కార్యకలాపాలపై ఉక్కుపాదం: జూదం, అక్రమ మద్యం, గంజాయి, ఇసుక అక్రమ రవాణా వంటి చట్టవిరుద్ధ కార్యకలాపాలకు పాల్పడితే ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. ప్రజల సమస్యల పరిష్కారం: ఠాణాకు వచ్చే బాధితులు, ఫిర్యాదుదారులకు త్వరితగతిన న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని, పోలీస్ శాఖ ఎల్లప్పుడూ ప్రజలకు అందుబాటులో ఉంటుందని స్పష్టం చేశారు.

# అకాల మరణం పొందిన కుటుంబాలను పరామర్శించిన ఖ.ఎ. రామ్ నర్సింహా రెడ్డి



ఆకినపల్లి గ్రామానికి చెందిన కీ.శే. దూడపాక రాజయ్య, రాజుల సమ్మయ్య ఇటీవల అకాల మరణం పొందడంతో వారి కుటుంబాలను ఖ.ఎ. రామ్ నర్సింహా రెడ్డి (Addl. SP Rtd.) శుక్రవారం పరామర్శించారు. కుటుంబ సభ్యులను ఓదార్చి, మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కష్ట సమయంలో కుటుంబ సభ్యులకు ధైర్యం కల్పిస్తూ, వారి బాధలో తాను భాగస్వామినని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్ మెట్టు పవన్ కుమార్ పాల్గొన్నారు.

# మహేశ్వరం ప్రాంతాన్ని భారత్ ఫ్యూచర్ సిటీలో కలపాలి జేఏసీ డిమాండ్

### - విలీనం కాని గ్రామాలను చేర్చాలని జేఏసీ డిమాండ్
### - ఈ నెల 31, సెప్టెంబర్ 1న రిలే నిరాహార దీక్షలు





**హైదరాబాద్ ఎస్టేట్ రంగారెడ్డి ప్రతినిధి కృష్ణ చారి ఆగస్టు 28**

మహేశ్వరం, ఆగస్టు 28: రంగారెడ్డి జిల్లాలో ప్రతిష్టాత్మకంగా అభివృద్ధి చేయనున్న భారత్ ఫ్యూచర్ సిటీలో మహేశ్వరం ప్రాంతాన్ని పూర్తిస్థాయిలో భాగస్వామ్యం చేయాలని ఫ్యూచర్ సిటీ జాయింట్ యాక్షన్ కమిటీ (జేఏసీ) డిమాండ్ చేసింది. ఈ మేరకు మహేశ్వరంలో శుక్రవారం జేఏసీ ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. తెలంగాణ ప్రభుత్వం చేపడుతున్న ఫ్యూచర్ సిటీ ప్రాజెక్టులో మహేశ్వరం, కందుకూరు మండలాలకు చెందిన కొన్ని గ్రామాలు ఇప్పటికే విలీనమయ్యాయని జేఏసీ నాయకులు తెలిపారు. మిగిలిన గ్రామాలను కూడా ఫ్యూచర్ సిటీలో చేర్చాలని కోరుతూ ఆయా గ్రామ పంచాయతీల సర్పంచ్ లు ఏకగ్రీవ తీర్మానాలు చేసి ఎంపీడీవోతో పాటు జేఏసీకి అందజేయాలని సూచించారు. ఈ అంశంపై రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, రంగారెడ్డి జిల్లా ఇంఛార్జ్, ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబుకు పలుమార్లు వినతిపత్రాలు సమర్పించినట్లు తెలిపారు. జేఏసీ ఛైర్మన్ వత్తుల రఘుపతి మాట్లాడుతూ.. సుమారు 30 వేల ఎకరాల్లో భారత్ ఫ్యూచర్ సిటీని అభివృద్ధి చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందని తెలిపారు. ఐటీ, ఏఐ, డేటా సెంటర్లు, లైఫ్ సైన్సెస్, విద్య, వైద్యం, తయారీ రంగాల్లో భారీ పెట్టుబడులు వచ్చే అవకాశం ఉందన్నారు. ఇప్పటికే అమెజాన్ వెబ్ సర్వీసెస్ డేటా సెంటర్‌కు శంకుస్థాపన జరగడం పెట్టుబడుల ఆకర్షణకు నిదర్శనమన్నారు. ఫ్యూచర్ సిటీలో పరిశ్రమలు, సంస్థలు ఏర్పాటైతే స్థానిక యువతకు ప్రత్యక్ష, పరోక్ష ఉపాధి అవకాశాలు పెరుగుతాయని పేర్కొన్నారు. ఔటర్ రింగ్ రోడ్డు, రీజినల్ రింగ్ రోడ్డు, శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయంతో అనుసంధానించే రహదారులు అభివృద్ధి కానుండటంతో మహేశ్వరం రవాణాపరంగా కీలక ప్రాంతంగా మారుతుందని తెలిపారు. బుల్లెట్ ట్రైన్ మెట్రో, రతన్ టాటా 300 ఫిట్ రేడియల్ రోడ్లు, మల్టీమోడల్ రవాణా వ్యవస్థలు అందుబాటులోకి వస్తే ఈ ప్రాంతానికి మరింత ప్రాధాన్యం పెరుగుతుందన్నారు.
కొత్త పరిశ్రమలు, కార్యాలయాలు, వాణిజ్య సంస్థలు, రహదారుల అభివృద్ధితో రియల్ ఎస్టేట్, నిర్మాణం, రవాణా, హోటళ్లు, చిన్న వ్యాపారాలు, సేవా రంగాలు విస్తరించే అవకాశం ఉందన్నారు.
ఈ సందర్భంగా జేఏసీ అధ్యక్షుడు కర్నాటి మనోహర్ మాట్లాడుతూ..
ఫ్యూచర్ సిటీ పూర్తిస్థాయిలో అభివృద్ధి చెందితే మహేశ్వరం ప్రాంతానికి భారీగా ప్రయోజనం చేకూరుతుందని, భవిష్యత్ తరాలకు మెరుగైన నగరాన్ని అందించేందుకు ప్రతి గ్రామ పంచాయతీ ముందుకు రావాలని ఆయన కోరారు. ఫ్యూచర్ సిటీలో విలీనం కోసం తీర్మానం చేయని గ్రామాల సర్పంచ్‌ల తీరుకు నిరసనగా ఈ నెల 31, సెప్టెంబర్ 1న మహేశ్వరం లోని ప్రభుత్వ కార్యాలయాల ముందు రిలే నిరాహార దీక్షలు చేపడతామని జేఏసీ నాయకులు ప్రకటించారు.
ఈ కార్యక్రమంలో మహేశ్వరం కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వట్టేలా మల్లేష్ యాదవ్, రాష్ట్ర బీజేపీ నాయకుడు కదారి జంగయ్య, సీపీఐ నాయకుడు దత్తునాయక్, బీజేపీ మాజీ ఎంపీటీసీ పోతర్ల సుదర్శన్ యాదవ్, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు కాకిశ్వర్ ముదిరాజ్, ఎమ్మార్పీఎస్ మాజీ మండల అధ్యక్షుడు ఎర్ర గణేష్, జేఏసీ సలహాదారు కె. జగన్‌రెడ్డి, గోటికె రవీందర్‌రెడ్డి, నర్సింహా యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# క్రీడలతో యువతకు ఉజ్వల భవిష్యత్

### - "ఎల్‌బీ నగర్‌లో ఉత్సాహంగా 'ఖేలో ఇండియా డైలాగ్'..
### - "ప్రధాని సందేశాన్ని వీక్షించిన విద్యార్థులు"

**హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి ఆగస్టు 28:-**

రంగారెడ్డి: యువతలో క్రీడా స్ఫూర్తిని పెంపొందించడంతో పాటు ఫిట్‌నెస్‌పై అవగాహన కల్పించే లక్ష్యంతో ఎల్‌బీ నగర్‌లోని అవినాష్ కాలేజ్ ఆఫ్ కామర్స్‌లో 'ఖేలో ఇండియా డైలాగ్‌ఖేల్ కీ బాత్ పీఎం కే సాథ్' కార్యక్రమాన్ని నిర్వహించారు. జాతీయ క్రీడా దినోత్సవం2026 సందర్భంగా మై భారత్, యువజన వ్యవహారాలు మరియు క్రీడల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. కళాశాల ప్రిన్సిపాల్ డా. నీతూ సచ్‌దేవా ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. మై భారత్ అధికారి యాదగిరి పాల్గొన్నారు. జాతీయ స్థాయి టెన్నిస్ క్రీడాకారిణి శ్రావ్య శివాని చిలకలపూడి విద్యార్థులతో ముచ్చటిస్తూ క్రీడా రంగంలో విజయానికి క్రమశిక్షణ, నిరంతర సాధన, పట్టుదల, ఆత్మవిశ్వాసం ఎంతో అవసరమని తెలిపారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ జి. సుధాకర్ కార్యక్రమాన్ని సమన్వయం చేశారు.
ఈ సందర్భంగా విద్యార్థులు, అధ్యాపకులు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నిర్వహించిన ప్రత్యక్ష వర్చువల్ కార్యక్రమాన్ని వీక్షించారు. క్రీడలను గ్రామీణ స్థాయి నుంచి ప్రోత్సహించడం, ప్రతిభావంతులైన క్రీడాకారులను గుర్తించి వారికి తగిన అవకాశాలు కల్పించడం, యువతలో ఫిట్‌నెస్‌ను జీవన విధానంగా మార్చడం వంటి అంశాలకు ప్రాధాన్యం ఇచ్చారు. క్రీడల ద్వారా శారీరక ఆరోగ్యంతో పాటు నాయకత్వ లక్షణాలు,




జట్టు స్ఫూర్తి, మానసిక ధైర్యం, క్రమశిక్షణ పెంపొందుతాయని కార్యక్రమంలో పేర్కొన్నారు. యువత మై భారత్ పోర్టల్‌లో నమోదు చేసుకొని స్వచ్ఛంద సేవ, సామాజిక కార్యక్రమాలు, నాయకత్వ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వికసిత భారత్ ఏ2047 లక్ష్య సాధనలో యువత చురుకైన భాగస్వాములు కావాలని మై భారత్ జిల్లా డిప్యూటీ డైరెక్టర్ స్నేహల్ ద్యానేశ్వర్ బసుట్కర్ పిలుపునిచ్చారు.

# సలాం హైదరాబాద్ హీరో చెంగల గిరి గౌడ్ మృతి..

## సినీ యూనిట్‌లో విషాదం

## వర్ధన్నపేటకు చెందిన నటుడు చెంగల గిరి గౌడ్ దుర్మరణం





**హైదరాబాద్ ఎస్టేట్ చిట్యాల ప్రతినిధి మ్యాదరి సునీల్**

**వర్ధన్నపేట:** వరంగల్ జిల్లా వర్ధన్నపేటకు చెందిన నటుడు చెంగల గిరి గౌడ్ అనూహ్య ప్రమాదంలో మృతి చెందడంతో సినీ వర్గాల్లో విషాద ఛాయలు అలుముకున్నాయి. హైదరాబాద్‌లో కేబుల్ వర్క్ చేస్తుండగా ప్రమాదవశాత్తు ఐదవ అంతస్తు నుంచి జారిపడి గిరి గౌడ్ మృతి చెందినట్లు సమాచారం.
గిరి గౌడ్‌కు నటనపై ఎంతో ఆసక్తి ఉండేది. ప్రత్యేకంగా నటనలో శిక్షణ పొందకపోయినా, ఆయనలో ఉన్న సహజమైన నటనా ప్రతిభను గుర్తించిన 'సలాం హైదరాబాద్' సినిమా దర్శకుడు పులి అమృత్ గౌడ్ ఆయనకు హీరోగా నటించే అవకాశం కల్పించారు. దర్శకుడు ఇచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటూ గిరి గౌడ్ తన నటనతో మెప్పించారని చిత్ర యూనిట్ సభ్యులు గుర్తు చేసుకున్నారు. సినిమా రంగంలో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకునే అవకాశం ఉన్న సమయంలోనే గిరి గౌడ్ అకాల మరణం చెందడం ఎంతో బాధాకరమని వారు పేర్కొన్నారు. ఎలాంటి శిక్షణ లేకపోయినా సహజమైన నటనతో ఆకట్టుకునే ప్రతిభ ఆయనలో ఉందని, భవిష్యత్‌లో మంచి నటుడిగా ఎదిగే అవకాశం ఉన్న వ్యక్తిని కోల్పోయామని ఆవేదన వ్యక్తం చేశారు. గిరి గౌడ్ మృతి పట్ల 'సలాం హైదరాబాద్' సినిమా యూనిట్ నటుడు బోయిని ఎల్లేష్, గేయ రచయిత మ్యాదరి సునీల్ తీవ్ర సంతాపం తెలిపారు. గిరి గౌడ్‌తో తమకున్న అనుబంధాన్ని గుర్తు చేసుకుంటూ, ఆయన మృతి కుటుంబ సభ్యులతో పాటు సినీ రంగానికి కూడా తీరని లోటు అని పేర్కొన్నారు.
"గిరిలో ఉన్న నటనా ప్రతిభను గుర్తించి దర్శకులు అవకాశం ఇచ్చారు. మంచి భవిష్యత్తు ఉన్న నటుడిని ఇంత చిన్న వయసులో కోల్పోవడం ఎంతో బాధాకరం. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని, కుటుంబ సభ్యులకు మనోధైర్యం కలగాలని కోరుకుంటున్నాం" అని వారు సంతాపం వ్యక్తం చేశారు. గిరి గౌడ్‌కు నివాళిగా 'సలాం హైదరాబాద్' చిత్ర యూనిట్ సభ్యులు ఆయనతో తమకున్న జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ కన్నీటి పర్యంతమయ్యారు. నటనపై ఉన్న ఆసక్తితో అడుగుపెట్టిన గిరి గౌడ్ ప్రయాణం మధ్యలోనే ఆగిపోవడం ప్రతి ఒక్కరినీ కలచివేసింది.

RNI No Tel / 2012 /4241
హైద్రాబాద్ ఎస్టేట్
తెలుగు దిన పత్రిక
THE LARGEST CIRCULATED TELUGU NEWS PAPER
hyderabadestate.co.in



# ఇందిరమ్మ టవర్స్‌తో పేదలకు సొంతింటి భరోసా

## "రాజేంద్రనగర్‌లో 480 ఇళ్లకు లక్కీడ్రా.. పారదర్శకంగా లబ్ధిదారుల ఎంపిక"

**హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి ఆగస్టు 28:-**

రాజేంద్రనగర్: పేద, మధ్యతరగతి కుటుంబాల సొంతింటి కలను సాకారం చేయడమే ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి నాయకత్వంలో చేపట్టిన ఇందిరమ్మ టవర్స్ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం లక్ష్మీగూడలోని లక్ష్మీ భవనంపొదుపు సంఘం హాల్‌లో నిర్వహించిన లక్కీ డ్రా కార్యక్రమంలో మంత్రి పాల్గొని ప్రక్రియను ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. రాష్ట్రవ్యాప్తంగా తొలి దశలో 4.50 లక్షలు, రెండో దశలో మరో 2.50 లక్షల ఇళ్ల నిర్మాణానికి ప్రభుత్వం ప్రణాళిక రూపొందించిందన్నారు. హైదరాబాద్ పరిధిలో పట్టణ పేదల కోసం లక్ష ఇళ్లను నిర్మించేందుకు చర్యలు చేపట్టామని తెలిపారు. పైలట్ ప్రాజెక్టుగా నాలుగు నియోజకవర్గాల్లో 480 ఇళ్ల చొప్పున నిర్మాణానికి టెండర్లు ఖరారయ్యాయని, త్వరలో మరిన్ని నియోజకవర్గాలకు విస్తరిస్తామని చెప్పారు. ఇందిరమ్మ టవర్స్‌లో ఒక్కో ఫ్లాట్ సుమారు 525 చదరపు అడుగుల విస్తీర్ణంలో ఉంటుందని, భూమి విలువతో కలిపి ఒక్కో ఇంటి విలువ రూ.6070 లక్షల వరకు ఉంటుందని తెలిపారు. లబ్ధిదారుల కుటుంబంలోని మహిళ పేరుతో ఇల్లు రిజిస్ట్రేషన్ చేస్తామని, రిజిస్ట్రేషన్ తదితర ఖర్చులను ప్రభుత్వమే భరిస్తుందని వెల్లడించారు. రాజేంద్రనగర్ నియోజకవర్గానికి కేటాయించిన 480 ఇళ్ల కోసం 1,881 దరఖాస్తులు అందాయని హౌసింగ్ బోర్డు ఎండీ పి.వి. గౌతమ్ తెలిపారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, దివ్యాంగులకు రిజర్వేషన్లు అమలు చేస్తూ లక్కీ డ్రా




నిర్వహిస్తున్నామని చెప్పారు. లక్కీ డ్రాలో పేరు రాని అర్హులకు వెయిటింగ్ లిస్ట్ ద్వారా భవిష్యత్‌లో అవకాశం కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్, అదనపు కలెక్టర్ డాక్టర్ కె.కిరణ్మయి, ఆర్డీఓ శ్రీధర్, పీడీ హౌసింగ్ చంప్లా నాయక్, అధికారులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

# RB న్యూస్ ఛానల్ రిపోర్టర్ పుల్ల రవితేజ ను పరామర్శించిన పుల్ల ఫ్యామిలీ సభ్యులు

**హైదరాబాద్ ఎస్టేట్ చిట్యాల ప్రతినిధి మ్యాదరి సునీల్** ఈరోజు చిట్యాల మండల కేంద్రానికి చెందిన పుల్ల వంశతుడైన ఆర్.బి న్యూస్ ఛానల్ రిపోర్టర్ పుల్ల రవితేజ పై జరిగిన దాడి విషయం తెలుసుకున్న పుల్ల వంశస్తులు వివిధ గ్రామాల నుండి విచ్చేసి అతడిని పరమర్శించారు. దాడికి సంబందించిన వివరాలు తెలుసుకోని వారు మాట్లాడుతూ ఇది చాల దుర్మార్గమైన దాడి అని,వారిని కొట్టుకుంటూ ఇంట్లోని వస్తువులను ధ్వంసం చేసిన ఈ దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. పుల్ల రవీందర్ కుటుంబ సభ్యులకు అండగా ఉంటామని ధైర్యంగా ఉండాలని చెప్పారు.పుల్ల వంశస్తులపై ఎలాంటి దాడి జరిగిన సహించబోమన్నారు. పుల్ల వంశాస్తులపై జరిగే దాడులు దౌర్జన్యాలు చేసే వారికి తగిన బుద్ధి చెపుతమన్నారు. భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు పునరావృతం అయితే పుల్ల వంశస్తుల అంటే ఏమిటో చూపిస్తామన్నారు ఇప్పటికైనా బుద్ధి తెచ్చుకొని సమాజంలో తోటి మనుషులను గౌరవిస్తూ అన్నదమ్ముల వలె కలిసిమెలిసి ఉండాలన్నారు. పరామర్శించిన వారు పుల్ల వంశస్తులు అంబేద్కర్ స్టడీ సెంటర్ ఉపసంచాలకులు డాక్టర్ పుల్ల శ్రీనివాస్, ప్రభాకర్ సార్ , కమలపూర్ ఉప సర్పంచ్ శ్రీనివాస్ ,ఇతార గ్రామాల వార్డు సభ్యులు రాద, శ్రీనివాస్, చిట్యాల 3వ వార్డ్ సభ్యులు పుల్ల నిర్మల సతీష్, రిటైడ్ ప్ర.ఉపాధ్యాయులు, ఇంజనీర్ కుమార్, లెక్చరర్ కుమార్ అంబేద్కర్ యువజన సంఘం రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ పుల్ల మల్లయ్య, ధర్మ సమాజ్ పార్టీ జిల్లా నాయకుడు అశోక్ అంబేద్కర్ యువజన



సంఘం మండల ప్రధాన కార్యదర్శి పుల్ల ప్రతాప్, సతీష్ కుమార్ , వీ౹ాా రాష్ట్ర సోషల్ మీడియా ఇచార్జీ హర్షవర్ధన్, ప్రవీణ్ సుమన్, శ్రీకాంత్ సమ్మయ్య సారయ్య సదయ్య, ప్రవీణ్ మున్నా తదితరులు పాల్గొన్నారు

# ఆత్మీయ అనుబంధానికి ప్రతీక రాఖీ పండుగ





**హైదరాబాద్, ఆగస్టు 28:**

అన్నా చెల్లెళ్ల ఆత్మీయ అనుబంధానికి ప్రతీక రాఖీ పండుగ అని మోత్కూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ విమలా వెంకటేశ్వర్లు అన్నారు. శుక్రవారం ఆనందోత్సవాల మధ్య మోత్కూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ నూనెముంతల విమలా వెంకటేశ్వర్లురాఖీ పండుగ జరుపుకున్నారు.

సోదరీ సోదరులకు ప్రీతి ప్రథమైన రాఖీపౌర్ణమిని సందర్భంగా అన్నా, చెల్లెళ్లు ఆనందోత్సవాల మధ్య రాఖీలు కడుతూ.. ఎటువంటి ఆపదలు తలెత్తకుండా ఎల్లవేళలా మేలు జరుగాలని ఆకాంక్షిస్తూ రాఖీలు కట్టుకున్నారు.

రాఖీపౌర్ణమి పండుగను సందర్భంగా సీఎం రేవంత్రెడ్డి, ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్యకు మోత్కూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ విమలా వెంకటేశ్వర్లు రాఖీ కట్టి సోదరభవాన్ని చాటుకున్నారు. ఈ కార్యక్రమంలో నూనెముంతల వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

# బ్యాగులో బంగారం, నగదు, ఆస్తిపత్రాలు..

## తిరుమలలో పోగొట్టుకున్న బ్యాగు భక్తులకు తిరిగి అప్పగింత

శ్రీవారి దర్శనానికి వచ్చే భక్తుల పట్ల టీటీడీ సిబ్బంది మరోసారి తమ నిజాయతీని, సేవాభావాన్ని చాటుకున్నారు. తిరుమల ఘాట్ రోడ్డులో గుంటూరుకు చెందిన ఓ కుటుంబం పోగొట్టుకున్న లక్షల రూపాయల విలువైన నగలు, నగదు ఉన్న బ్యాగును భద్రంగా వారికి అప్పగించి ప్రశంసలు అందుకున్నారు. మానవత్వం, బాధ్యత కలగలిసి ఓ భక్తుల కుటుంబంలో ఆనందం నింపిన ఈ ఘటన తిరుమలలో చోటుచేసుకుంది.

వివరాల్లోకి వెళితే.. గుంటూరు జిల్లా బ్రాడీపేటకు చెందిన పోతుల నారాయణ, సునీత దంపతులు తమ కుటుంబంతో కలిసి తిరుమల శ్రీవారి దర్శనానికి వస్తున్నారు. ఈ క్రమంలో శుక్రవారం ఉదయం తిరుపతి నుంచి తిరుమల వచ్చే రెండో ఘాట్ రోడ్డులో ప్రయాణిస్తుండగా, తమ బ్యాగును ఎక్కడో జారవిడుచుకున్నారు. ఆ బ్యాగులో 61 గ్రాముల బంగారు ఆభరణాలు, రూ.2,02,840 నగదుతో పాటు సుమారు రూ.10 లక్షల విలువైన భూమి ఒప్పంద పత్రాలు ఉన్నాయి.

ఉదయం సుమారు 6 గంటల సమయంలో ఘాట్ రోడ్డుపై వెళుతున్న ఓ బైకర్ ఆ బ్యాగును గమనించారు. వెంటనే దాన్ని తీసుకుని, ఉదయం 6:30 గంటలకు జీఎన్సీ టోల్‌గేట్ వద్ద విధుల్లో ఉన్న



హోంగార్డు రెడ్డప్పరావుకు అప్పగించారు. సమాచారం అందుకున్న టీటీడీ భద్రతా సిబ్బంది ఆ బ్యాగును కమాండ్ కంట్రోల్ సెంటర్‌కు తరలించి భద్రపరిచారు.

మరోవైపు, బ్యాగ్ పోయిందని గుర్తించిన భక్తుల కుటుంబం ఆందోళనతో వెతుకుతూ టీటీడీ అధికారులను సంప్రదించింది. వారు చెప్పిన వివరాలు, అందించిన గుర్తింపు ఆధారాలను అధికారులు క్షుణ్ణంగా పరిశీలించారు. అనంతరం టీటీడీ సీవీఎస్వో మురళీకృష్ణ ఆదేశాల మేరకు, ఏవీఎస్వోలు కృష్ణయ్య, వెంకట శివకుమార్‌ల సమక్షంలో బ్యాగును తెరిపించి, అందులోని వస్తువులను యజమానులతో సరిచూయించారు. నగదు, బంగారం, విలువైన పత్రాలు అన్నీ సురక్షితంగా ఉన్నాయని భక్తులు నిర్ధారించుకున్నారు. అనంతరం అధికారులు ఆ బ్యాగును వారికి సురక్షితంగా అప్పగించారు.

పోయిందనుకున్న తమ విలువైన వస్తువులు తిరిగి దక్కడంతో ఆ కుటుంబం ఆనందానికి అవధుల్లేకుండా పోయింది. కష్టకాలంలో బాధ్యతగా వ్యవహరించి బ్యాగును అప్పగించిన బైకర్‌కు, సమయస్ఫూర్తితో దానిని భద్రపరిచి తమకు అందజేసిన టీటీడీ భద్రతా సిబ్బందికి వారు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.

# బహిరంగ సభను జయప్రదం చేయండి

**హైదరాబాద్ ఎస్టేట్ మద్దిరాల (ప్రతినిధి)**



నూతన్ కల్ మండల కేంద్రంలోని స్టేడియం సభా స్థలం వద్ద శనివారం నాడు రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మరియు రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి నలమాద ఉత్తమ్ కుమార్ రెడ్డి చే సీలింగ్ భూముల రైతులకు పట్టాలు పంపిణీ చేసే కార్యక్రమం ఉన్నందున అట్టి సభను జయప్రదం చేయుట కొరకు తొమ్మిది మండలాల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మరియు కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులతో కలిసి ప్రెస్ మీట్ లో మాట్లాడు తు గత 70 సంవత్సరంల నుండి ఎర్ర పహాడ్ దొరల భూములు అమ్మి రైతుల కు పట్టాలు చేయక పోవడం తో రైతులు ఇబ్బందులు పడ్డారు. గత ప్రభుత్వం 10 సంవత్సరలు రైతులను పట్టించుకోలేదు, ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం రేవంత్ రెడ్డి రైతుల కష్టాలు తీర్చడానికి 2000 మంది రైతు కుటుంబాలకి 3000 ఎకరాల పట్టా పాస్ బుక్కులు ఇవ్వబోతున్న కాంగ్రెస్ ప్రభుత్వం,భూ భారతి ధ్వారా రైతుల కష్టాలు తీర్చడం జరుగుతుంది అని,తెలియజేసిన,తుంగతుర్తిశాసనసభ్యులుమందుల సామేలు తదనంతరం మాట్లాడుతూ రేపు జరగబోయే సభను అధిక సంఖ్యలో పాల్గొనివిజయవంతం చేయాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వివిధ మండలాల అధ్యక్షులు మరియు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు

# ఘనంగా రాఖీ పౌర్ణమి వేడుకలు

## హాజరైన ఖైరతాబాద్ డీసీసీ ప్రధాన కార్యదర్శి గడ్డం శ్రీధర్ గౌడ్, కాంగ్రెస్ నాయకులు

**ఖైరతాబాద్, ఆగస్టు 28:**



సోదరభావానికి, ఆత్మీయ అనురాగాలకు ప్రతీక అయిన రాఖీ పౌర్ణమి పండుగ వేడుకలు ఘనంగా నిర్వహించబడ్డాయి. ఈ వేడుకల్లో ఖైరతాబాద్ జిల్లా కాంగ్రెస్ పార్టీ (డీసీసీ) ప్రధాన కార్యదర్శి గడ్డం శ్రీధర్ గౌడ్ పాల్గొని ప్రజలకు, పార్టీ శ్రేణులకు రాఖీ పౌర్ణమి శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ సందర్భంగా నాయకులు, కార్యకర్తలు ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకుంటూ ఉత్సాహంగా వేడుకలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు బొడిగె సమంత, దోమకొండ కిషోర్, కోటం రవీందర్, గడ్డం సాయి తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి ఇంటికి ఐదు చెట్లను నాటండి

## : మాదాపూర్ సర్పంచ్ భూర మాధురి దిలీప్ గౌడ్




**హైదరాబాద్ ఎస్టేట్ రంగారెడ్డి ప్రతినిధి కృష్ణచారి ఆగస్టు 28**

వి బి జి రాంజీ ఉపాధి హామీ పథకం ద్వారా ఈరోజు వనమహోత్సవం కార్యక్రమం లో భాగంగా మాదాపూర్ గ్రామంలో సర్పంచ్ భూర మాధురి దిలీప్ గౌడ్ ఆధ్వర్యంలో రోడ్డుకు ఇరువైపులా చెట్లను నాటడం జరిగింది. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి మాట్లాడుతూ చెట్లు సరిగా లేకపోవడంతో వర్షాలు కూడా పడటం లేదని దీనివల్ల అనావృష్టి ఏర్పడి పాడిపంటలు సరిగ్గా రాకపోవడం వల్ల రైతులకు ఇబ్బందులకు గురవుతున్నారని చెప్పారు. అదేవిధంగా ప్రజలకు తాగనూటి కొరత కూడా ఏర్పడుతుందని చెట్లను పెంచడం వల్ల చాలా లాభాలు ఉన్నాయని ప్రతి ఒక్కరు మొక్కలు నాటడంలో బాధ్యత తీసుకోవాల్సిన అటువంటి అవసరం ఉందని గ్రామ ప్రజలకు పిలుపునిచ్చారు ఈ యొక్క కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి సురేష్, వార్డు సభ్యులు మంద సురేష్, ఫీల్డ్ అసిస్టెంట్ సత్యం, చేగురి కృష్ణ, బత్తుల జంగయ్య, కారోబార్ దండు శ్రీధర్, ముత్యాలు, అనిత విజయ తదితరులు పాల్గొనడం జరిగింది.

# నాగబాబుకు చిరంజీవి అభినందనలు.. కొత్త బాధ్యతలపై అన్నయ్య హర్షం




జనసేన ఎమ్మెల్సీ, తన సోదరుడు కొణిదెల నాగబాబుకు మెగాస్టార్ చిరంజీవి హృదయపూర్వక అభినందనలు తెలిపారు. ఆంధ్రప్రదేశ్ గ్రీన్ ఎగ్జిక్యూటివ్ కమిటీ చైర్మన్‌గా నాగబాబు ఇవాళ బాధ్యతలు స్వీకరించిన నేపథ్యంలో, చిరంజీవి 'ఎక్స్' వేదికగా స్పందించారు. ఇది నాగబాబుకు లభించిన ఒక గొప్ప అవకాశమని ఆయన అభిప్రాయపడ్డారు."ప్రియమైన నాగబాబు, ఏపీ గ్రీన్ ఎగ్జిక్యూటివ్ కమిటీ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించినందుకు హృదయపూర్వక శుభాకాంక్షలు. ప్రకృతిపై నీకున్న మక్కువకు ప్రతిఫలంగా ప్రకృతి మాత ప్రసాదించిన అద్భుత అవకాశంగా దీన్ని భావిస్తున్నాను" అని చిరంజీవి తన పోస్ట్‌లో పేర్కొన్నారు. పచ్చని, మెరుగైన ఆంధ్రప్రదేశ్ నిర్మాణంలో భాగస్వామ్యం కావడం గర్వకారణమని ఆయన వ్యాఖ్యానించారు. ఈ నూతన ప్రయాణంలో నాగబాబు విజయవంతం కావాలని, ప్రజలకు మరింతగా సేవలు అందించాలని ఆకాంక్షించారు.ఇటీవల ఈ పదవిలో నియమితుడైన నాగబాబు, బాధ్యతలు చేపట్టిన అనంతరం ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, ప్రధాని నరేంద్ర మోదీలకు కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్రంలో పచ్చదనం పెంపు, పర్యావరణ పరిరక్షణే ధ్యేయంగా 'గ్రీన్ ఆంధ్రప్రదేశ్' లక్ష్యం కోసం పూర్తి నిబద్ధతతో కృషి చేస్తానని ఆయన ఈ సందర్భంగా స్పష్టం చేశారు.

RNI No Tel / 2012 /4241
హైద్రాబాద్ ఎస్టేట్
THE LARGEST CIRCULATED TELUGU NEWS PAPER
తెలుగు దిన పత్రిక
hyderabadestate.co.in



# ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం సానుకూలంగా ఉంది

## - ఎమ్మెల్యే నాయిని



ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం సానుకూలంగా ఉందని వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యులు శ్రీ నాయిని రాజేందర్ రెడ్డి గారు అన్నారు.హనుమకొండలో తెలంగాణ ఉద్యోగులు, గెజిటెడ్ అధికారులు, ఉపాధ్యాయులు, కార్మికులు, పెన్షనర్ల జేఏసీ ఆధ్వర్యంలో నిర్వహించిన ధర్నాకు ఆయన సంఘీభావం తెలిపారు.
ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ ఉద్యోగుల సమస్యలు పరిష్కారం కావాలనే తనకు కూడా ఉందని, సమస్యలపై పోరాడకుండా, తప్పించుకుని తిరగడం తనకు అలవాటు లేదన్నారు. ఉద్యోగుల సమస్యలపై ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి గారితో ఇప్పటికే చర్చించిన తర్వాతే తాను ధర్నా కార్యక్రమానికి హాజరయ్యానని తెలిపారు.
ఉద్యోగుల ప్రధాన డిమాండ్లైన రెండో పీఆర్సీ అమలు, సీపీఎస్ రద్దు చేసి పాత పెన్షన్ విధానం (ఓపీఎస్) పునరుద్ధరణ, పెండింగ్‌లో ఉన్న డీఏల మంజూరు,ఉద్యోగులుపెన్షనర్ల సమస్యల పరిష్కారం వంటి అంశాలపై ప్రభుత్వం నిర్ణయం తీసుకునే అవకాశం ఉందని ఎమ్మెల్యే ఆశాభావం వ్యక్తం చేశారు. త్వరలోనే శుభవార్త వస్తుందన్న నమ్మకం తనకు ఉందన్నారు.హెల్త్ కార్డులు, రిటైర్మెంట్‌కు సంబంధించిన సమస్యలతో పాటు ఉద్యోగులు, పెన్షనర్లు ఎదుర్కొంటున్న ఇతర ఇబ్బందుల పరిష్కారానికి సంబంధిత మంత్రులు, ఆర్థిక శాఖతో మాట్లాడుతున్నట్లు తెలిపారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితుల నేపథ్యంలో అన్ని శాఖలను సమన్వయం చేసుకుంటూ, ఒక్కో సమస్యను ప్రాధాన్యత క్రమంలో పరిష్కరించాల్సిన అవసరం ఉందన్నారు.
ఉద్యోగులు ఎలాంటి సమస్యను ఎదుర్కొన్నా నేరుగా తన దృష్టికి తీసుకురావాలని, అవసరమైతే ముఖ్యమంత్రిని కలిసి సమస్యపై చర్చించేందుకు తాను కూడా వారితో కలిసి వస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. సమస్యల పరిష్కారానికి రాజకీయాలకు అతీతంగా, వ్యవస్థాత్మకంగా ముందుకు సాగాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు.
ఉద్యోగులు వివిధ పార్టీలకు అభిమానులుగా ఉండవచ్చని, అయితే ఉద్యోగుల సమస్యల పరిష్కారం విషయంలో అందరూ కలిసి పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. ప్రభుత్వంతో చర్చలు జరిపి, సమన్వయంతో ముందుకు వెళ్తే సమస్యలు తప్పకుండా పరిష్కారమవుతాయన్న విశ్వాసాన్ని వ్యక్తం చేశారు.
తాను ధర్నాకు వచ్చే ముందు కూడా ప్రభుత్వ పెద్దలతో సమస్యలపై సుదీర్ఘంగా చర్చించానని, ఏ విధంగా ముందుకు వెళ్లాలి, సమస్యలను ఎలా పరిష్కరించాలి అనే అంశాలపై చర్చించిన తర్వాతే ఇక్కడికి వచ్చానని తెలిపారు. ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్ల ఆశీర్వాదంతో ఈ సమస్యల పరిష్కారానికి తప్పకుండా కృషి చేస్తానని నాయిని రాజేందర్ రెడ్డి గారు స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో ూచీ+టాం ప్రతినిధులు పాల్గొన్నారు.

# నేటి నుంచి ఇందిరమ్మ టవర్స్ లక్కీడ్రా

## - నాంపల్లి, రాజేంద్రనగర్లో పాల్గొననున్న మంత్రి పొంగులేటి,



రాష్ట్రప్రభుత్వం క్యూర్ పరిధిలో ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ఇందిరమ్మ ఇండ్లు - టవర్స్ లబ్ధిదారుల ఎంపికకు శుక్రవారం లక్కీ డ్రా నిర్వహించనుంది. రాష్ట్ర గృహనిర్మాణ, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి నాంపల్లి రాజేం ద్రనగర్ నియోజకవర్గాలలో జరిగే కార్యక్రమాల్లో లక్కీ డ్రా తీస్తారు. నాంపల్లి నియో జకవర్గం పరిధిలోని రెడ్డిల్స్ వెట్స్ గార్డెన్స్లో ఉదయం 11 గంటలకు, రాజేంద్రనగర్ నియోజకవ ర్గం లక్ష్మీగూడలో ఉన్న పొదుపు సంఘం హాలులో మధ్యాహ్నం 12 గంటలకు జరిగే కార్యక్రమాల్లో మంత్రి పాల్గొని డ్రా తీస్తారు. క్యూర్ పరిధిలోని 16 నియోజకవర్గాలలో ఇందిరమ్మ ఇండ్లు నిర్మిస్తున్న విషయం తెలిసిందే. ఇందిరమ్మ టవర్స్ పథకంలో భాగంగా లాటరీ ప్రక్రియ శుక్రవారం నుంచి 31వ తేదీ వరకు నిర్వహించనున్నారు. రోజూ నాలుగు అసెంబ్లీ నియోజకవర్గాలు చొప్పున 16 అసెంబ్లీ నియోజకవర్గాల్లో నాలుగు రోజులపాటు ఈ ప్రక్రియ ను చేపడుతున్నారు. ఈ లాటరీ ప్రక్రియనం తటినీ యూట్యూబ్ ద్వారా ప్రత్యక్ష ప్రసారం చేస్తున్నారు. లాటరీ ప్రక్రియ ప్రత్యక్ష ప్రసారాన్ని హౌసింగ్ బోర్డు వెబ్ సైట్ లోనూ హౌసింగ్ డిపార్ట్మెంట్ సోషల్ మీడియా హ్యాండిల్స్ టీజీహెచ్ ఉన్న ఫేస్ బుక్, ఇన్ స్టాగ్రామ్ ద్వారా చూడవచ్చు. అదేవిధంగా శుక్రవారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గం- గాజుల రామారం గండి మైసమ్మ ఫంక్షన్ హాల్ లోనూ, సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోయినపల్లిలోని మల్లారెడ్డిగార్డెన్స్లో లాటరీ జరుగుతుంది. శనివారంనాడు ఖైరతాబాద్ నియోజకవర్గం.. కుమ్రభీం ఆదివాసీభవన్, కూకటపల్లి- కేపీహె చ్బీ కమ్యూనిటీ హాల్లో, అంబర్పేట- మహ రాణా ప్రతాప్ ఫంక్షన్ హాల్, బహదూర్ పుర-ఎస్టీఆర్ప్ర్ల్ ప్యాలెస్లో లాటరీ నిర్వహిస్తారు. ఈ నెల 30న శేరిలింగంపల్లి- గచ్చిబౌలిలోని నిర్మిత కేంద్ర ప్రాంగణంలోనూ, మలక్ పేట చంపాపేటలోని సాదియా ఫంక్షన్ హాల్లో, ఇబ్రహీ పట్నం- బండ్లగూడ రాజీవ్ స్వగృహ కమ్యూనిటీ హాల్ లో, మేడ్చల్- పోచారం స్వగృహ కమ్యూనిటీ హాల్లో లాటరీ నిర్వహిస్తారు. ఈ నెల 31న మల్కాజిగిరి- కౌకూర్ ప్రాజెక్టులో, ఆల్వాల్ వీబీఆర్ గార్డెన్స్, సనత్నగర్- పాటిగడ్డ హెవన్ ప్యాలెస్ ఫంక్షన్ హాల్ , మహేశ్వరం- బడంగ్ పేట్ ప్రజాభవన్లో లాటరీలను నిర్వహించనున్నట్లు గృహనిర్మా ణ శాఖ అధికారులు తెలిపారు.

# బండారు పల్లి ఓల్డ్ స్టూడెంట్స్ అసోసియేషన్ కమిటీ ఎన్నిక..

## -అధ్యక్షులు గా బైకని మోహన్ యాదవ్.




బండారుపల్లి రెసిడెన్షియల్ ఓల్డ్ స్టూడెంట్స్ అసోసియేషన్ కమిటీని ఎన్నుకున్నట్లు ఓల్డ్ స్టూడెంట్స్ అసోసియేషన్ సభ్యులు తెలిపారు. ములుగు జిల్లా బండారుపల్లి లో 1986 నుండి 2026 వరకు పదవ తరగతి పూర్తి చేసిన దాదాపు 3000 వేల మంది పూర్వ విద్యార్థుల అభిప్రాయం మేరకు,స్టీరింగ్ కమిటీ ఏర్పాటు చేసి అందులో నుండి ఈ కమిటీ ఎన్నిక జరిగిందని,ఈ కమిటీ ఎన్నికకు గత మూడు నెలలుగా ఆరు దఫాలుగా మీటింగ్ నిర్వహించి,స్టీరింగ్ కమిటీ సభ్యుల అభిప్రాయం మేరకు తుది మీటింగ్ , నిర్వహించి 30 మంది సభ్యులతో కమిటీ ఎన్నుకున్నట్లు నిర్వాహకులు,పూర్వ విద్యార్థులు తెలిపారు.
బ్రోస నూతన కమిటీ
అధ్యక్షులుగా బైకాని మోహన్ యాదవ్, ప్రధాన కార్యదర్శిగా పులి దేవేందర్ ముదిరాజ్,కోశాధికారిగా కందాల రామయ్య,లను ఎన్నుకున్నారు. ఈ కమిటీ భీమారం లోని అరుణోదయ జూనియర్ కళాశాలలో పూర్వపు విద్యార్థుల సమక్షంలో ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన అధ్యక్షులు బైకానీ మోహన్ యాదవ్ మాట్లాడుతూ పాఠశాల అభివృద్ధికి, సభ్యుల కష్ట సుఖాలు పంచుకునే వేదికగా ఈ బ్రోసా కమిటి ముందుకు వెళుతుందని,ప్రపంచ గా వివిధ దేశాలలో స్థిరపడ్డ పూర్వ విద్యార్థులను సమన్వయం చేసుకొని ముందుకు వెళుతున్నామని అన్నారు.అనంతరం ప్రధాన కార్యదర్శిగా ఎన్నికైన పులి దేవేందర్ ముదిరాజ్ మాట్లాడుతూ చేతనైనంత గా పాఠశాల మౌలిక సదుపాయాల కల్పన, ప్రస్తుతం చదువుతున్న విద్యార్థులకు ప్రతిభ పురస్కారాలు అందజేయడం,పూర్వ విద్యార్థుల సంక్షేమం కోసం సమిష్టి కృషితో ముందుకు వెళతామని అన్నారు.కోశాధికారిగా ఎన్నికైన కందాల రామయ్య మాట్లాడుతూ తాత్కాలిక లక్ష్యాల కోసం కాకుండా, భవిష్యత్తు లక్ష్యాలను దృష్టిలో ఉంచుకొని ఈ బ్రోస అనే ఏర్పాటు చేయడం జరిగిందని, పూర్వ విద్యార్థులలో వివిధ స్థాయిలలో ఉన్నతమైన పదవుల్లో ఉన్నతమైన ఉద్యోగాల్లో ఉన్న వారి సహాయ సహకారాలు తీసుకొని పనిచేస్తామని, ఉపాధ్యాయులను ముఖ్య సలహాదారులుగా ఏర్పాటు చేసుకొని ముందుకు వెళతామని అన్నారు. ఈ కార్యక్రమంలో రవి కుమార్, కందాల శంకరయ్య, రామయ్య, రాజు, డీవీ.శర్మ, తిరుపతి, మహేందర్,ఎన్.రమేష్, దిలీప్ రామాంజనేయులు, కే నరేష్, పి ఓదేలు, పి.మహేందర్,రానా ప్రతాప్ గౌడ్,రామాంజనేయులు,బోయినీ రాకేష్,పి. నరేష్,పొదిలి ప్రశాంత్,వేములపల్లి కార్తీక్, డి.పెద్దన్న,ఏ.వెంకటేశ్వర్లు,ఈ చందు,ఏ.నరేష్, వి.సదానందం,కే.వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

# విద్య, వైద్య రంగాలకు ప్రాధాన్యం

## - మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి,



విద్య, వైద్య రంగాలకు ప్రజా ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యమిస్తోం దని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి పేర్కొన్నారు. ఖమ్మం జిల్లా పాలేరు నియోజకవర్గ పర్యటనలో భాగంగా గురువారం తిరుమలాయపాలెం మండలం ఎర్రగడ్డ గ్రామ పంచాయతీ పరిధి గోపాలపురం గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో రూ.30 లక్షల వ్యయంతో నిర్మించనున్న రెండు అదనపు తరగతి గదుల నిర్మాణానికి జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ తో కలిసి మంత్రి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, రూ.30 లక్షలతో రెండు అదనపు తరగతి గదుల నిర్మాణాన్ని చేపడుతున్నామని, విద్యార్థుల కోసం తాత్కాలిక షెడ్డు నిర్మించేందుకు టీచర్ సుమారు రూ.40 వేల సొంత డబ్బును వెచ్చించడం అభినందనీయమని చెప్పారు. విద్యార్థుల్లో నైపుణ్యాలను పెంపొందించేందు కు ప్రత్యేకంగా దృష్టి సారించామని, స్కిల్ యూనివర్సిటీని ఏర్పాటు చేశామని తెలిపారు. తిరుమలాయ పాలెం మండలంలో వైద్య రంగానికి కూడా ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యత ఇస్తోందని మంత్రి అన్నారు. ఇందిరమ్మ ఇళ్ల మొదటి దశలో ఇళ్లను మంజూరు చేశామని, ప్రస్తుతం రెండో దశ ఇళ్లను అందిస్తున్నామని, అర్హత ఉన్న ప్రతి కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు అందుతుందని స్పష్టం చేశారు. కొత్త పింఛన్ల మంజూరు కోసం ఈ నెల 31 వరకు దరఖాస్తులు స్వీకరిస్తున్నామని మంత్రి తెలిపారు. కార్యక్రమంలో ఏదులాపురం మునిసిపల్ చైర్ పర్సన్ పోకబత్తిని అనిత, పిఆర్ ఎస్ఈ వెంకట్ రెడ్డి, ఆర్ అండ్ బి ఎస్ఈ యుగంధర్ రావు, హౌజింగ్ పిడి భూక్యా శ్రీనివాస్, ఖమ్మం ఆర్డీవో ఎన్. శ్రీనివాస్, తిరుమలాయపాలెం మండల ఎంపీడీవో సిలార్ సాహెబ్, తహశీల్దార్ విల్సన్, జిల్లా కాంగ్రెస్ నాయకులు చావా శివకుమార్, ఎర్రగడ్డ గ్రామ పంచాయతీ సర్పంచ్ నల్లమల్ల కీర్తి నీరన్ కుమార్, ప్రజాప్రతినిధులు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణలో బీజేపీ బలోపేతానికి కసరత్తు

## - 30న రాష్ట్రానికి సునీల్ బన్సల్, - పార్టీ నేతలతో ప్రత్యేక సమావేశం, - భవిష్యత్ కార్యాచరణపై సమీక్ష




తెలంగాణ బీజేపీ బలోపేతం దిశగా కేంద్ర నాయకత్వం ప్రణాళికలు రూపొందిస్తున్నది. ఈ క్రమంలో రాష్ట్ర వ్యవహారాల ఇన్చార్జి సునీల్ బన్సల్ ఈనెల 30న రాష్ట్రానికి రానున్నా రు. ఈ సందర్భంగా ఆయన పార్టీ రాష్ట్ర నేతలతో ప్రత్యేకం గా సమావేశమై రాష్ట్రంలో పార్టీ పనితీరు, సంస్థాగత అంశాలు, తాజా రాజకీయ పరిణామాలపై సమీక్ష నిర్వహించనున్నట్లు తెలిసింది. రాష్ట్రంలో పార్టీని మరింత బలోపేతం చేసేందుకు చేపట్టాల్సిన కార్యక్రమా లపై నేతలతో చర్చించనున్నారు. మోడీ గుజరాత్ ముఖ్య మంత్రిగా 12.5 ఏళ్లు, ప్రధానమంత్రిగా 12.5 ఏళ్ల రాజకీ య ప్రస్థానాన్ని పురస్కరించుకొని మొత్తం 25 ఏళ్ల ప్రజా జీవితాన్ని వివరించేలా ప్రచార కార్యక్రమాలను రూపొం దించడంపై పార్టీ నేతలు కసరత్తు చేస్తున్నారు. సేవా సంకల్ప మహోత్సవ్ పేరుతో సెప్టెంబర్ 17 నుంచి అక్టోబర్ 17 వరకు నెల రోజుల పాటు కార్యక్రమాలను నిర్వహిం చనున్నా రు. మోడీ 25 ఏళ్ల రాజకీ య ప్ర స్థానం, పాలన, అభివృద్ధి కార్యక్ర మాలు, సంక్షేమ పథకాలను వివరిం చే ఫొటో, డిజిటల్ ప్రదర్శనలను కూడా ఏర్పాటు చేయనున్నారు. సుపరిపాలన, అభివృ ద్ధి, అంత్యోదయ అంశాలపై సదస్సు లు, మేధావుల సమావేశాలు నిర్వహించడంతో పాటు యువత, సమాజంలోని వివిధ వర్గాలతో ముఖా ముఖి కార్యక్రమాలు చేపట్టను న్నారు.
కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంక్షేమ పథకాలు, వాటి ద్వారా ప్రజలకు అందుతున్న ప్రయోజనాలపై అవగాహ న కల్పించేందుకు ప్రత్యేక శిబిరాలను నిర్వహించాలని బీజేపీ యోచిస్తోంది. ముఖ్యంగా అట్టడుగు వర్గాల అభ్యున్నతిని లక్ష్యంగా చేసుకున్న అంత్యోదయ భావనపై కూడా సమావేశాలు, చర్చలు నిర్వహించనున్నారు.
వచ్చే నెల 17న నిర్వహించనున్న తెలంగాణ విమోచన దినోత్సవ కార్యక్రమాల నిర్వహణ పైనా సునీ ల్ బన్సల్ రాష్ట్ర నేతలతో చర్చించ నున్నారు. పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించే కార్యక్రమాల రూప కల్ప న. వాటిని ప్రజల్లోకి తీసుకెళ్లే విధానంపై సమీక్షించే అవకాశం ఉంది. రైతు సమస్యలను తీసుకుని బీజేపీ ఎమ్మెల్యే పార ట్టనున్న యాత్రపైనా స, అవకాశాలున్నట్లు తెలుస్తోం సంబంధించిన తేదీల ను ఖరారు -స్యలను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లే కార్యాచర ణపై కూడా పార్టీ నాయక త్వం దృష్టి సారించనుంది. మొత్తం గా సునీల్ బన్సల్ పర్యటన నేపథ్యంలో తెలంగా ణ బీజేపీ భవిష్య త్ కార్యాచ రణ, ప్రజా సమస్యలపై పోరాటాలు, పార్టీ కార్యక్రమాల విస్తరణకు సంబంధించి కీలక నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉన్నట్లు పార్టీ వర్గాల్లో చర్చ జరుగుతోంది.

# ఉల్లి ఘాటు పెరుగుతోంది

## - 30 శాతం పాడైన నిల్వలు,
## - వర్షాలులేక ఖరీఫ్ పంట ఆలస్యం,



దేశంలో పంచదార ధరతో పోటీపడి ఉల్లి ధరలు పెరుగుతున్నాయి. ఈ ధరలను అదుపు చేసేందుకు బఫర్ స్టాక్స్ నుంచి భారీగా మార్కెట్లోకి విడుదల చేసి కేజీ 35 రూపాయలకు విక్రయించాలని కేంద్రం నిర్ణయించింది. ఇలా నిల్వ చేసిన ఉల్లిలో 30 శాతం సరుకు ఎందుకు పనికిరాకుండా పోయింది. దీంతో ఉల్లి ధరలను నియంత్రించేందుకు ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలకు గండిపడే సూచనలున్నా యని మార్కెట్ వర్గాలు అంచనా వేస్తున్నాయి.నేషనల్ అగ్రికల్చరల్ కో-ఆపరేటివ్ మార్కె టింగ్ ఫెడరేసన్ ఆఫ్ ఇండియా (నాఫెడ్0, నేషనల్కో-ఆపరేటివ్ కన్స్యూమర్ ఫెడరేషన్ (ఎన్సీసీఎఫ్) ఈ సంవత్సరం సేకరించిన 1.2 లక్షల టన్నుల ఉల్లిపాయల్లో 30 శాతం కుళ్లిపోయి పాడయ్యాయి. సాధా రణంగా ఏటా జరిగే 20 శాతం నష్టంతో పోలిస్తే ఈ ఏడాది నష్టం 40 శాతానికి పైగా పెరిగే అవకాశం ఉం దని ఒక సీనియర్ అధికారి ఆందోళన వ్యక్తం చేశారు. వేసవి ఉల్లి కోతల సమయంలో కురిసిన అకాల వర్షాలు పంట నాణ్యతను దెబ్బతీశాయని, దీంతో నిల్వ సామర్థ్యాన్ని తగ్గించాయని నాఫెడ్ అధికారి ఒకరు తెలిపారు. తదుపరి పంట చేతికి వచ్చే వరకు మార్కెట్ డిమాండ్ను తీర్చడంలో కీలకంగా ఉండే నిల్వలు ఇలా పాడవడం వల్ల ధరలపై మరింత ప్రభా వం చూపే అవకాశం ఉందని భావిస్తున్నారు.

# భూపాలపల్లి మైన్స్ ఏడీ ఇళ్లపై ఏసీబీ సోదాలు

## - నగదు, బంగారం, ఆస్తి పత్రాలు, బ్యాంకు ఖాతాల పరిశీలన,
## - 12 ప్రాంతాల్లో ఏకకాలంలో తనిఖీలు,



జయశంకర్ భూపాలపల్లి జిల్లా మైన్స్ ఏడీ బొజ్జ జయరాజు నివాసాలు, కార్యాలయాలపై అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులు గురువారం ఏకకాలంలో సోదాలు నిర్వహిస్తున్నారు. ఆదాయానికి మించి ఆస్తులు కూడబెట్టారన్న ఆరోపణల నేపథ్యంలో వరంగల్ రేంజ్ ఏసీబీ డీఎస్పీ సాంబయ్య నేతృత్వంలో ఈ తనిఖీలు కొనసాగుతున్నట్లు సమాచారం. భూపాలపల్లి, ములుగు, వరంగల్, హైదరాబాద్లో నివాసాలతో పాటు సూర్యాపేట, తాండూరు తదితర ప్రాంతాల్లో సుమారు 12 చోట్ల ఏసీబీ బృందాలుఏకకాలంలో తనిఖీలు చేపట్టినట్లు తెలుస్తోంది. ఈ సోదాల్లో నగదు, బంగారం, ఆస్తి పత్రాలతో పాటు బ్యాంకు ఖాతాలు, లాకర్లు, ఇతర ఆర్థిక లావాదేవీలకు సంబంధించిన వివరాలను అధికారులు పరిశీ లిస్తున్నట్లు సమాచారం. బొజ్జ జయరాజు గతంలో ములుగు జిల్లా మైన్స్ ఏడీగా పనిచేసిన సమయంలో ఇసుక, మట్టి క్వారీల వ్యవహారాల్లో అవకతవకలకు పాల్పడ్డారంటూ ఆరోపణలు వచ్చినట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో ప్రస్తుతం ఏసీబీ సోదాలు జరగడం చర్చనీయాంశంగా మారింది. వివిధ ప్రాంతాల్లో కొనసాగుతున్న తనిఖీల్లో కీలక పత్రాలు, ఆస్తులకు సంబంధించిన వివరాలను అధికారులు సేకరిస్తున్నట్లు సమాచారం. అయితే సోదాలు ఇంకా కొనసాగుతున్నందున స్వాధీనం చేసుకున్న నగదు, బంగారం, ఆస్తుల విలువ తదితర పూర్తి వివరాలు అధికారికంగా వెల్లడికావాల్సి ఉంది. ఏసీబీ అధికారుల ప్రకటన అనంతరం ఈ వ్యవహారంపై మరిన్ని వివరాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది.

RNI No Tel / 2012 /4241
ప్రతి అక్షరం.. ప్రజల పక్షం..
హైద్రాబాద్ ఎస్టేట్
THE LARGEST CIRCULATED TELUGU NEWS PAPER
తెలుగు దిన పత్రిక
hyderabadestate.co.in
29 శనివారం ఆగస్టు 2026

# అదంతా నా కష్టార్జితమే : కొమురం



కొమరక్కగా పాప్యులర్ అయిన కొమురం గురించే ఇప్పుడు అంతా మాట్లాడుకుంటున్నారు. 'ఇరుముడి' సినిమాలో ఆయన పోషించిన 'నాగులు' పాత్ర ఆడియన్స్ కి బాగా కనెక్ట్ అయింది. ఈ నేపథ్యంలో తాజాగా 'సుమన్ టీవీ'కి ఇచ్చిన ఇంటర్వ్యూలో కొమురం తన గురించిన అనేక విషయాలను గురించి ప్రస్తావిస్తూ వెళ్లాడు. "మేము షాద్ నగర్ దగ్గరలో ఉంటాము. మా ఇల్లు .. పొలాలు అక్కడే ఉంటాయి. ఒకప్పుడు ఒక దొర ఉన్న ఇల్లునే మేము కొనుక్కున్నాము" అని చెప్పాడు. " నటుడిగా నేను జబర్దస్త్ లో పేరు తెచ్చుకున్నా .. సినిమాలు చేస్తున్నా మా అమ్మ ఇప్పటికీ కూరగాయలు అమ్ముతూనే ఉంటుంది. ఒక్కోరోజు ఒక్కో సంతలో ఆమె కూరగాయలు అమ్ముకుని వస్తుంటుంది. మా నాన్న .. మా అన్నయ్య .. నేను కూడా వ్యవసాయం చేస్తాము. మాకు ఒక 40 బర్రెలు ఉన్నాయి. నేను కూడా పాలుపితుకుతూనే ఉంటాను. కష్టపడి పనిచేయడంలో సంతృప్తి ఉంటుంది. షూటింగ్ లేకపోతే నేను మా ఊళ్లోనే ఉంటాను" అని అన్నాడు. " హైదరాబాదులో ఒక చిన్న రూములో అద్దెకి ఉంటూ వేషాల కోసం తిరిగాను. నాకు వచ్చిన కొంతమొత్తంలోనే పొలాలు కొంటూ వెళ్లాను. మాకు ఇప్పుడు 20 ఎకరాల పొలం ఉంది .. అందులో 17 ఎకరాలు నేను కొన్నదే. పొలాలు కొనాలనే ఆసక్తి నాకు మొదటి నుంచి ఉండేది. అందువలన తక్కువ రేట్లు ఉన్నప్పుడే కొనడం జరిగింది. అప్పట్లో జబర్దస్త్ చేసే వాళ్లందరికీ కూడా నేను చెప్పాను .. పొలాలు కొనమని. నా మాటను చాలామంది వినిపించుకోలేదు. ఆ తరువాత అయ్యో అంటూ బాధపడినవారు కూడా ఉన్నారు" అని చెప్పాడు.

# 'లూజర్' సాంగ్.. 'ఐయామ్ గేమ్' కోసం గాయకుడిగా మారిన దుల్కర్ సల్మాన్

యూత్ ఐకాన్, విలక్షణ నటుడు దుల్కర్ సల్మాన్ నటిస్తున్న తాజా యాక్షన్ ఎంటర్‌టైనర్ 'ఐయామ్ గేమ్'. నహాస్ హిదాయత్ దర్శకత్వంలో రూపొందుతున్న ఈ చిత్రంపై భారీ అంచనాలు నెలకొని ఉన్నాయి. ఈ సినిమా నుంచి అభిమానుల కోసం 'లూజర్' అనే గీతాన్ని మేకర్స్ గురువారం విడుదల చేశారు. మలయాళంలో ఈ పాటను స్వయంగా దుల్కర్ సల్మాన్ ఆలపించడం విశేషం.'లూజర్' అనే పదాన్ని సాధారణంగా నెగటివ్‌గా చూస్తారు. కానీ ఈ పాటలో మాత్రం దాన్ని చాలా సరదాగా, పాజిటివ్‌గా సెలబ్రేట్ చేసుకునేలా చిత్రీకరించారు. సినిమాలోని పాత్రల స్వభావాలను, వారి అస్తవ్యస్తమైన ప్రపంచాన్ని ఈ పాట సరదాగా పరిచయం చేస్తుంది. జేక్స్ బిజోయ్ అందించిన సంగీతం, సుహైల్ కోయా సాహిత్యం పాటకు మరింత ఊపునిచ్చాయి. తెలుగులో ఈ పాటకు సనారే సాహిత్యం అందించగా, బెన్నీ దయాళ్ ఆలపించాడు. ఈ పాట గురించి దుల్కర్ మాట్లాడుతూ, ""లూజర్స్'ను సెలబ్రేట్ చేసే పాట ఇది. చాలా సరదాగా అనిపించింది. దీన్ని పాడే అవకాశం కూడా నాకు లభించింది" అని అన్నారు. సినిమాలో తన పాత్ర గురించి చెబుతూ, "ఈ చిత్రంలో నేను చాలా అల్లరిచిల్లరగా ఉండే పాత్రలో కనిపిస్తాను. ఇది నిజ జీవితంలో నాకు పూర్తి భిన్నమైనది. సినిమా చివరికల్లా నా పాత్రలో మార్పు వచ్చి, మీ అందరినీ మళ్ళీ గెలుచుకుంటానని ఆశిస్తున్నాను" అని వివరించారు.

మలయాళంతో పాటు తెలుగు, తమిళం, హిందీ, కన్నడ భాషల్లో ఈ పాటను విడుదల చేసినట్లు దుల్కర్ సోషల్ మీడియా ద్వారా తెలిపారు. వాస్తవానికి ఈ సినిమా ఆగస్టు 20న విడుదల కావాల్సి ఉండగా, సెప్టెంబర్ 3కి వాయిదా పడింది. మరింత విస్తృతంగా, ఎక్కువ థియేటర్లలో విడుదల చేయాలనే ఉద్దేశంతోనే ఈ నిర్ణయం తీసుకున్నట్లు దుల్కర్ గతంలో ఓ ప్రకటనలో వెల్లడించారు. "గేమ్ పెద్దది అవుతోంది, విడుదల కూడా విస్తృతంగా ఉంటుంది. ఈ సినిమాను సెప్టెంబర్ 3న ప్రపంచవ్యాప్తంగా విడుదల చేస్తున్నాం" అని ఆయన



పేర్కొన్నారు. ఈ యాక్షన్ థ్రిల్లర్‌ను దుల్కర్ సల్మాన్ తన సొంత నిర్మాణ సంస్థ వేఫేరర్ ఫిల్మ్స్‌పై జోమ్ వర్గీస్‌తో కలిసి నిర్మించారు. దాదాపు 11 నెలల పాటు 156 రోజుల షూటింగ్ జరుపుకున్న ఈ చిత్రాన్ని దక్షిణ భారతదేశంలోని 100కు పైగా లొకేషన్లలో చిత్రీకరించారు. ఆంటోనీ వర్గీస్, మిస్కిన్, కయాదు లోహర్, కదిర్, సంయుక్త విశ్వనాథన్ కీలక పాత్రల్లో నటించగా, అన్బరివ్ మాస్టర్స్ యాక్షన్ కొరియోగ్రఫీ అందించారు.

# 'రంభ ఊర్వశి మేనక' టైటిల్ సాంగ్ విడుదల.. డ్యాన్స్ నంబర్‌తో అల్లరి నరేశ్ సందడి




విలక్షణ నటనతో ప్రేక్షకులను అలరిస్తున్న హీరో అల్లరి నరేశ్, తనదైన కామెడీ టైమింగ్‌తో మరోసారి సందడి చేసేందుకు సిద్ధమవుతున్నారు. ఆయన కథానాయకుడిగా నటిస్తున్న కొత్త చిత్రం 'రంభ ఊర్వశి మేనక'. ఈ సినిమా నుంచి తాజాగా టైటిల్ సాంగ్‌ను చిత్రబృందం విడుదల చేసింది. హైదరాబాద్ లోని ప్రసాద్ ల్యాబ్స్ లో జరిగిన ఓ కార్యక్రమంలో ఈ పాటను ఆవిష్కరించారు. పూర్తి ఎనర్జిటిక్ డ్యాన్స్ నంబర్‌గా ఉన్న ఈ పాట లిరికల్ వీడియోను ఆదిత్య మ్యూజిక్ ద్వారా ప్రేక్షకుల ముందుకు తీసుకువచ్చారు. ఈ పాటకు ప్రముఖ సంగీత దర్శకుడు చైతన్ భరద్వాజ్ స్వరాలు సమకూర్చగా, సురేష్ బనిశెట్టి సాహిత్యం అందించారు. గాయకులు ధనుంజయ్ సీపాన, సాహితి చాగంటి తమ గాత్రంతో పాటకు ప్రాణం పోశారు. ప్రస్తుతం ఈ లిరికల్ వీడియో యూట్యూబ్‌లో సంగీత ప్రియులను ఆకట్టుకుంటోంది. సినిమాపై అంచనాలను పెంచేలా ఈ పాట ఉందని ప్రేక్షకులు స్పందిస్తున్నారు. చంద్రమోహన్ చింతడా రచన, దర్శకత్వంలో ఈ సినిమా తెరకెక్కుతోంది. అన్నపూర్ణ స్టూడియోస్, హాస్య మూవీస్ బ్యానర్లపై రాజేష్ దండా, ప్రసాద్ నిమ్మకాయల ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. అల్లరి నరేశ్ సరసన సురభి హీరోయిన్‌గా నటిస్తోంది. వీరితో పాటు సీనియర్ నటుడు నరేశ్, శ్రీనివాస్ రెడ్డి, వెన్నెల కిశోర్, రాశీ సింగ్, విష్ణు ప్రియ, హరితేజ, రవి ప్రకాశ్, గోపరాజు రమణ వంటి భారీ తారాగణం ఈ సినిమాలో నటిస్తోంది. ఈ చిత్రానికి రామ్ రెడ్డి సినిమాటోగ్రఫీ అందిస్తుండగా, ఛోటా కె ప్రసాద్ ఎడిటర్‌గా వ్యవహరిస్తున్నారు. అన్ని కార్యక్రమాలను పూర్తి చేసి, ఈ చిత్రాన్ని సెప్టెంబర్ 4న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల చేసేందుకు నిర్మాతలు సన్నాహాలు చేస్తున్నారు.

# సన్నీ లియోన్ పై నమోదైన కేసును కొట్టేసిన కోర్టు

బాలీవుడ్ నటి సన్నీ లియోన్, ఆమె భర్త డేనియల్ వెబర్‌లకు ముంబై సెషన్స్ కోర్టులో భారీ ఊరట లభించింది. వారిపై నమోదైన చీటింగ్, క్రిమినల్, నమ్మకద్రోహం కేసును కోర్టు కొట్టివేసింది. ఒక తెలుగు సినిమా ఆఫర్ విషయంలో రూ. 1.75 కోట్ల లావాదేవీకి సంబంధించి, తనకు రావలసిన రూ. 70 లక్షలకు పైగా కమీషన్ బకాయిలు చెల్లించకుండా మోసం చేశారంటూ టాలెంట్ కోఆర్డినేటర్ ఓం ప్రకాశ్ జైన్ దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ జరిపిన న్యాయస్థానం ఈ కీలక తీర్పును వెలువరించింది. గతంలో ఇదే అంశంపై జైన్ మేజిస్ట్రేట్ కోర్టును ఆశ్రయించగా... 2024 అక్టోబర్‌లో ఆ ఫిర్యాదును మేజిస్ట్రేట్ కోర్టు తిరస్కరించింది. దానిని సవాలు చేస్తూ ఆయన దిండోషి అదనపు సెషన్స్ కోర్టులో రివిజన్ పిటిషన్ దాఖలు చేశారు. అయితే, కేసు విచారణలో భాగంగా పన్ను ఇన్వాయిస్‌లు, ఇతర పత్రాలను పరిశీలించిన అదనపు సెషన్స్ జడ్జి పి.ఏ. సానే.. ఈ వ్యవహారం కేవలం రెండు పక్షాల మధ్య జరిగిన వాణిజ్య లావాదేవీల ఒప్పందానికి సంబంధించినది మాత్రమేనని స్పష్టం చేశారు. ఒప్పందం ప్రకారం చెల్లింపులు జరగకపోవడం లేదా ఆర్థిక వివాదాలు తలెత్తడం వ్యాపారపరమైన ఉల్లంఘన మాత్రమే అవుతుందని, దానికి క్రిమినల్ నేరం (మోసం లేదా నమ్మకద్రోహం) రంగు పులమలేమని న్యాయమూర్తి వ్యాఖ్యానించారు. మొదటి నుంచే మోసం చేసే దురుద్దేశం ఉన్నట్లు ప్రాథమిక ఆధారాలు ఉంటేనే దానిని క్రిమినల్ కేసుగా పరిగణించవచ్చని



పేర్కొంటూ ఓం ప్రకాశ్ జైన్ పిటిషన్‌ను కొట్టేస్తూ సన్నీ లియోన్ దంపతులను నిర్దోషులుగా పేర్కొన్నారు.

# ఫ్యాషన్ ఐకాన్ ఫరియా అబ్దుల్లా కిల్లర్ లుక్

చిట్టి ఫరియాగా తెలుగు వారి గుండెల్లో స్థిరపడిపోయింది ఫరియా అబ్దుల్లా. కేవలం ఐదేళ్లలో ఇండస్ట్రీలో ఎంతో తెలివిగా సెలక్టివ్ గా కెరీర్ బండిని నడిపిస్తూ అందరి దృష్టిని ఆకర్షిస్తోంది ఈ భామ. పూర్తి వివరాల్లోకి వెళితే.. టాలీవుడ్ యంగ్ అండ్ డైనమిక్ బ్యూటీ ఫరియా అబ్దుల్లా గ్లామర్ అండ్ ఫ్యాషన్ ప్రపంచంలో ఎప్పుడూ తనదైన మార్కును చూపిస్తూనే ఉంటుంది. ఇటీవల -డాన్స్ ఐకాన్ సీజన్ 2- వేదికపై ఈ భామ ధరించిన కస్టమ్ మేడ్ డెనిమ్ చీర సోషల్ మీడియాలో విపరీతంగా వైరల్ అవుతోంది. సాంప్రదాయ చీరకట్టుకి భిన్నంగా... స్ట్రీట్‌వేర్ యాటిట్యూడ్‌తో డెనిమ్ మెటీరియల్.. బూట్స్ -బెల్ట్‌లతో ఐశ్వర్య డిజైన్ చేసిన ఈ ఫ్యూజన్ లుక్ ప్రతి ఒక్కరినీ ఆకట్టుకుంది. శక్తి స్మరణ్ ఫోటోగ్రఫీ, అనుషా అలీ మేకప్‌లో ఫరియా సరికొత్త ఫ్యాషన్ ట్రెండ్‌ను క్రియేట్ చేసిందంటూ నెటిజన్లు కామెంట్ల రూపంలో ప్రశంసల వర్షం కురిపిస్తున్నారు. చిట్టి కిల్లర్ లుక్ అదిరిపోయిందంటూ కితాబు దక్కింది. ఫరియా అబ్దుల్లా 2026లో కూడా వరుస సినిమాలతో ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. ఈ ఏడాది -అనగనగా ఒక రాజు- చిత్రంలో పీతాంబరిగా కామియో పాత్రలో మెరవగా, -గాయపడ్డ సింహం- చిత్రంలో షాలిని అనే బలమైన పాత్రతో అలరించింది. వీటితో పాటు తమిళ-తెలుగు ద్విభాషా చిత్రంగా తెరకెక్కుతున్న -సిగ్మా-లోనూ ఫరియా కీలక పాత్ర పోషిస్తోంది. నటనలోనే కాకుండా డాన్స్, పాటల రచన, సింగింగ్‌లోనూ ప్రయోగాలు చేస్తూ తన బహుముఖ ప్రజ్ఞను నిరూపించుకుంటోంది. ప్రత్యేకించి ఫరియా నటిస్తున్న -సిగ్మా- సినిమా ఇప్పటికే షూటింగ్ పూర్తి చేసుకుని విడుదలకి సిద్ధమవుతోంది. ఈ తమిళ-తెలుగు ద్విభాషా యాక్షన్ థ్రిల్లర్ లో ఫరియా అబ్దుల్లాతో పాటు సౌత్ ఇండస్ట్రీకి చెందిన ప్రముఖ నటీనటులు సాంకేతిక నిపుణులు పని చేస్తున్నారు. ఒక సరికొత్త కాన్సెప్ట్, సమాజంలో వైవిధ్యమైన నేపథ్యం ఉన్న పాత్రల చుట్టూ తిరిగే కథాంశంతో ఈ చిత్రం రూపుదిద్దుకుందని తెలుస్తోంది. ఈ చిత్రం ద్వారా తమిళంలో కూడా ఫరియా బలమైన పునాది





వేసుకోవాలని భావిస్తోంది. 2021లో వచ్చిన బ్లాక్‌బస్టర్ హిట్ -జాతి రత్నాలు- సినిమాలో -చిట్టి- (అడ్వకేట్ షామిలి) పాత్రతో కెరీర్ ప్రారంభించిన ఫరియా.. ఈ ఐదేళ్ల కాలంలో సుమారు ఏడెనిమిది సినిమాలలో నటించింది. మోస్ట్ ఎలిజిబుల్ బ్యాచ్‌లర్, బంగార్రాజు, లైక్ షేర్ & సబ్‌స్క్రైబ్, రావణాసుర, ఆ ఒక్కటీ అడక్కు, కల్కి 2898 ఏఏడీ, మత్తు వదలరా 2, గుర్రం పాపిరెడ్డి.. ఇలా వరుస అవకాశాలు దక్కించుకుంది. నటిగా మాత్రమే కాకుండా కొరియోగ్రాఫర్‌గా, లిరిసిస్ట్‌గా, సింగర్‌గా కూడా తన ప్రతిభను చాటుకుంది. తొలి చిత్రంతోనే విశేష గుర్తింపు తెచ్చుకుని... ఐదేళ్లలో ఇన్ని విభిన్నమైన ప్రాజెక్ట్‌లలో భాగమవ్వడం ఒక నటిగా గొప్ప విషయమేనని చెప్పవచ్చు. అయితే ఫరియాలో ఉన్న అపారమైన ప్రతిభ, స్క్రీన్ ప్రెజెన్స్, కమాండింగ్ పర్సనాలిటీకి తగినట్లుగా పరిశ్రమలో తనకు మరింత పెద్ద అవకాశాలు, సోలో హిట్ చిత్రాలు రావాల్సి ఉందనేది విశ్లేషకులు- అభిమానుల అభిప్రాయం. కేవలం కామియోలు, సెకండ్ లీడ్ లేదా సపోర్టింగ్ పాత్రలకే పరిమితం చేయకుండా... తనలోని పూర్తి స్థాయి నటిని బయటకు తీసే విధంగా ప్రధాన పాత్రలతో కూడిన లీడ్ ఆఫర్లు ఇస్తే ఫరియా స్టార్ గా తన స్థానాన్ని మరింత పటిష్టం చేసుకునే అవకాశం ఉంది.

# రకుల్ నోట శూర్పణఖ కథ..

## తెలియని విషయాలు బయటపెట్టిన నటి!



రామాయణంలో శూర్పణఖ అంటే చాలామందికి వెంటనే గుర్తుకొచ్చేది ప్రతినాయకురాలి పాత్రే. కానీ, 'రామాయణ' చిత్రంలో తాను పోషిస్తున్న శూర్పణఖ పాత్రలో అంతకుమించిన కోణాలున్నాయని నటి రకుల్ ప్రీత్ సింగ్ చెప్పింది. ఆ పాత్రలోని అనేక అంశాలు తనను ఈ సినిమా వైపు ఆకర్షించాయని తెలిపింది. రావణుడి సోదరిగా శూర్పణఖ పాత్రలో రకుల్ కనిపించనుంది. లంకలో అత్యంత అందమైన మహిళల్లో ఆమె ఒకరని చెబుతారని రకుల్ గుర్తుచేసుకుంది. ఆమెకు అహంకారం ఉన్నప్పటికీ.. పాత్రలో చాలా కోణాలున్నాయని చెప్పింది. నటిగా అలాంటి పాత్రలను ఆవిష్కరించడం ఆసక్తికరంగా ఉంటుందని తెలిపింది. స్క్రిప్ట్ చదివే వరకు శూర్పణఖ జీవితం గురించి తనకు తెలియని విషయాలు చాలానే ఉన్నాయని రకుల్ చెప్పింది. లక్ష్మణుడు ఆమె ముక్కు కోసిన ఘటనకు ముందు, తర్వాత జరిగిన పరిణామాలను సినిమాలో కొత్త కోణంలో చూపిస్తున్నట్లు వెల్లడించింది. రాముడిని శూర్పణఖ ఎలా కలుస్తుందన్న విషయాల్లోనూ కొత్త అంశాలు తెలుసుకున్నానని తెలిపింది. రణ్‌బీర్ కపూర్, సాయిపల్లవి, యశ్, సన్నీ డియోల్, రవి దూబే కీలక పాత్రల్లో నటిస్తున్న ఈ చిత్రం భారీ అంచనాల మధ్య తెరకెక్కుతోంది. 'రామాయణ: పార్ట్-1' 2026 నవంబర్ 6న ప్రేక్షకుల ముందుకు రానుంది.

# ఆత్మకథగా రజనీకాంత్ ప్రస్థానం.. అధికారికంగా ప్రకటించిన కుమార్తె సౌందర్య

సూపర్‌స్టార్ రజనీకాంత్ తన సుదీర్ఘ సినీ ప్రయాణాన్ని, జీవిత అనుభవాలను పుస్తక రూపంలో అభిమానులకు అందించబోతున్నారని ఆయన కుమార్తె, దర్శకురాలు సౌందర్య రజనీకాంత్ వెల్లడించారు. ఇటీవల ఓ ఇంటర్వ్యూలో మాట్లాడిన ఆమె... ఆ పుస్తకం తయారీ ప్రాసెస్ చాలా ప్రత్యేకంగా సాగుతోందని తెలిపారు.

రజనీకాంత్ ఐదు దశాబ్దాల సినీ ప్రయాణంలోని విజయాలు, వ్యక్తిగత అనుభవాలు, అగ్రస్థానానికి చేరుకునే క్రమంలో ఎదుర్కొన్న సవాళ్లతో ఈ పుస్తకం రూపుదిద్దుకుంటోంది. పరమహంస యోగానంద రాసిన 'ఒక యోగి ఆత్మకథ' పుస్తకంలాగే ఈ పుస్తకం కూడా తరతరాలకు స్ఫూర్తినిస్తుందని సౌందర్య నమ్మకం వ్యక్తం చేశారు. ఒకవేళ తన తండ్రి జీవితాన్ని సినిమాగా తెరకెక్కించే అవకాశం వస్తే అది తనకు అత్యంత ప్రత్యేకమైన విషయమని ఆమె తెలిపారు. సృజనాత్మకతకు స్పష్టత, క్రమశిక్షణ చాలా ముఖ్యమని తన తండ్రి నేర్పించారని పేర్కొన్నారు. ప్రస్తుతం సౌందర్య నిర్మాణంలో నెట్‌ఫ్లిక్స్ కోసం 'లవ్' అనే రొమాంటిక్ తమిళ వెబ్‌సిరీస్ రూపొందుతోంది. బాలాజీ మోహన్ దర్శకత్వం వహిస్తున్న ఈ సిరీస్‌లో అర్జున్ దాస్, ఐశ్వర్య లక్ష్మి



ప్రధాన పాత్రలు పోషిస్తుండగా... ఇది అక్టోబరులో నెట్‌ఫ్లిక్స్ వేదికగా విడుదల కానుంది.